

జీవించేందుకే మనిషి తినాలి
సమాజ సంక్షేమానికి జీవించాలి
- డాక్టర్ బిఆర్ అంబేద్కర్


REGD NO : APTEL 16144

# జనస్వరం

పవర్

అక్షరమే ఆయుధం

www.janaswaram.com



## పాఠకులకు విజ్ఞప్తి

జనస్వరం న్యూస్ తెలుగు దినపత్రిక నందు తక్కువ ఖర్చుతో పుట్టినరోజు శుభాకాంక్షలతో పాటు అన్ని కార్యక్రమాలకు ప్రకటనలకు సంప్రదించండి. మా మెయిల్ ఐడీ :
janaswaramnews@gmail.com
మొబైల్ నెంబర్ : 7013030690



సంపుటి : 4 | సంచిక : 176 | ఎడిటర్ : నరేష్ సాకే | తేది : 08-01-2025 | పేజీలు : 6


# అర్జీలూ ఆన్‌లైన్‌లో !



- కుప్పంలో 'జన నాయకుడు' పోర్టల్‌ను ప్రారంభించిన సీఎం
- 8 సార్లు గెలిపించిన నియోజకవర్గానికి నేను చేయాల్సింది చాలా ఉంది
- నేడో రేపో టీడీపీ కోటి సభ్యత్వం
- కార్యకర్తలకు ఆమోదయోగ్యమైన వారికే నామినేటెడ్ పదవులు
- పార్టీ పోస్టులు కూడా ముఖ్యమైనవే
- మే నెలలోగా అన్ని రకాల పదవులూ భర్తీ
- గత ఐదేళ్లలో కబ్జాలు, వివక్షలు
- అన్నీ సరిదిద్దడానికి 4-5 నెలలు: బాబు
- కుప్పంలో రెండో రోజూ పర్యటన

**కుప్పం, జనవరి 7 (జనస్వరం) :** సొంత నియోజకవర్గం కుప్పం నుంచి వినూత్న ప్రయోగాలు చేసే ముఖ్యమంత్రి చంద్రబాబు.. తాజాగా మరో కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రజలు, కార్యకర్తలు ఇచ్చే అర్జీలను ఇక నుంచి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం 'జన నాయకుడు' పేరుతో ఓ పోర్టల్‌ను సిద్ధం చేశారు. మంగళవారం కుప్పం నుంచే దానికి శ్రీకారం చుట్టారు. భవిష్యత్‌లో దీనిని రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తామన్నారు. మంగళవారం రెండో రోజు ఆయన కుప్పంలో బిజీబిజీగా గడిపారు. టీడీపీ కార్యాలయంలో 'జననాయకుడు' పోర్టల్‌ను ప్రారంభించి.. అది పనిచేసే తీరును పరిశీలించారు. సిబ్బంది అర్జీలను ఎలా తీసుకుని నమోదు చేస్తున్నారో గమనించారు. కొన్ని అర్జీలను తానే పరిశీలించి తక్షణం పరిష్కరించారు. అనంతరం కార్యాలయ ఆవరణలో ప్రజల నుంచి సుమారు 1,090 అర్జీలను స్వీకరించారు. వాటిని పరిష్కరించాలని అక్కడికక్కడే అధికారులను ఆదేశించారు.ఆ తర్వాత విలేకరుల సమావేశంలో మాట్లాడారు. '8 సార్లు గెలిపించిన కుప్పం నియోజకవర్గానికి నేను చేయాల్సింది చాలా ఉంది. ఇచ్చిన హామీలను నెరవేర్చే బాధ్యత నాది. ఎమ్మెల్యే హోదాలో ఇక్కడ సమస్యల పరిష్కారానికి జననాయకుడు పోర్టల్‌ను ఏర్పాటు చేసుకున్నాను. అరాచక పాలనకు వైసీపీ పరాకాష్ఠ. నాతో సహా మా శ్రేణుల మీద కేసులు పెట్టారు. రాజకీయ కక్షతో ఐదేళ్లలో మీడియాపై పెట్టిన కేసులను కూడా తొలగించేస్తాం' అని చెప్పారు. టీడీపీ చరిత్రలో ఎప్పుడూ కోటి సభ్యత్వం నమోదు కాలేదని.. నేడో రేపో ఆ లక్ష్యాన్ని చేరుకోనున్నామని తెలిపారు. కార్యకర్తల్లో ఆమోదయోగ్యమైన వారికే గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పదవులిస్తామన్నారు. ప్రభుత్వ పదవులతోపాటు పార్టీలో ఇచ్చే పదవులు కూడా ముఖ్యమైనవేనని.. మే నెలలోగా అన్నిరకాల పదవులనూ భర్తీ చేస్తామని స్పష్టం చేశారు.

**'ఎనీవేర్' మంచిదే కానీ..**

ఎనీవేర్ రిజిస్ట్రేషన్ మంచిదేనని.. కానీ గత ఐదేళ్లలో రికార్డులను తారుమారు చేసి ఇష్టానుసారం రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని సీఎం ధ్వజమెత్తారు. వాటన్నింటినీ పరిష్కరిస్తామన్నారు. అందుకే రెవెన్యూ సదస్సులు వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. గోదావరి-పెన్నా అనుసంధానం, పోలవరం-బనకచర్ల అనుసంధానం.. రాష్ట్రానికి గేమ్ చేంజర్ లాంటివి. వేల టీఎంసీలు సముద్రంలో కలిసిపోతున్నాయి. బనకచర్లకు నీళ్లు తెస్తే రాయలసీమలోని అన్ని ప్రాజెక్టులకు నీళ్లు సరిపోతాయి. రాష్ట్రంలో కరువు అనేది ఉండదు' అని తెలిపారు.

**శంకుస్థాపనలు..**

ఎన్టీఆర్ స్టేడియంలో మదర్ డెయిరీ, శ్రీజ మహిళా మిల్క్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్, ఎన్టీఆర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, కడా ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ల నిర్మాణానికి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. వివిధ కంపెనీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. చివరిగా ద్రవిడ వర్సిటీలోని అకడమిక్ బ్లాక్ కొత్త భవనాన్ని ప్రారంభించారు. రాత్రి కుప్పం ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌసలో బస చేసిన ఆయన.. బుధవారం కుప్పం నుంచి బయల్దేరి ప్రధాని పర్యటనలో పాల్గొనేందుకు విశాఖపట్నం వెళ్లనున్నారు.

**మనిషి చనిపోతే 5 లక్షలు... పాడికి 50 వేలు**

**విపత్తు సాయంపై ఉత్తర్వులు జారీ**

ప్రకృతి విపత్తులతో ఆస్తి, పంట నష్టపోయిన బాధితులకు అందించే సాయంపై రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. గతేడాది ఆగస్టు, సెప్టెంబరులో భారీ వర్షాలు, వరదల సమయంలో బాధితులకు వర్తింపజేసిన నష్టపరిహారం (స్కేల్ ఆఫ్ అసిస్టెన్స్) ప్యాకేజీని కొనసాగించింది. తాజాగా ఉత్తర్వుల ప్రకారం విపత్తుల కారణంగా మనిషి చనిపోతే రూ.5 లక్షలు, ఆవులు, గేదెల మృతి చెందితే రూ.50 వేలు, ఎద్దులకు రూ.40 వేలు, దూడలకు రూ.25 వేలు, గొర్రెలు, మేకలకు రూ.7,500, కోడికి రూ.100 చొప్పున, పశువుల పాక దెబ్బతింటే రూ.5 వేలు ఇవ్వనున్నారు. ముంపుబారిన పడిన గ్రౌండ్ ఫ్లోర్ ఇళ్లకు రూ.10వేలు, కిరాణా షాపులు, రెస్టారెంట్లు, ఇతర దుకాణాలకు రూ.25 వేలు, రూ.40 లక్షల టర్నోవర్ ఉండే రిజిస్టర్డ్ వ్యాపారులు, ఎంఎసఎంఈలకు రూ.50 వేలు, రూ.40 లక్షల నుంచి రూ.కోటిన్నర వరకు టర్నోవర్ చేసే వ్యాపారులకు రూ.లక్ష, రూ.కోటిన్నర పైన టర్నోవర్ చేసే వ్యాపారులకు రూ.లక్షన్నర ఇవ్వనున్నారు. ద్విచక్ర వాహనానికి రూ.3 వేలు, ఆటోలకు రూ.10 వేలు, తోపుడు బండ్లకు రూ.20 వేలు, చేనేతలకు రూ.25 వేలు, చేనేతల ముడిసరుకు నష్టానికి రూ.10 వేలు, చేపల వల పాడైతే రూ.3 వేలు, వల పూర్తిగా దెబ్బతింటే రూ.10 వేలు, నాన్‌మోటరైజ్డ్ బోటు పూర్తిగా దెబ్బతింటే రూ.20 వేలు, మోటరైజ్డ్ బోటు పూర్తిగా దెబ్బతింటే రూ.25 వేలు, చేపల చెరువుల రిపేర్లకు హెక్టారుకు రూ.18 వేలు, పట్టు పరిశ్రమకు రూ.25 వేలు ఇవ్వనున్నారు. హెక్టారు వరి, పత్తి, వేరుశనగ, చెరకుకు రూ.25 వేలు, రాగులు, సజ్జ, కొర్రలు, సామలు, ఆముదం, జూట్, నువ్వులు, మినుము, పెసర, కంది, సోయా, సన్‌ఫ్లవర్, పొగాకు, మొక్కజొన్నకు రూ.15 వేలు చేశారు. ఉద్యాన పంటల్లో మిర్చి హెక్టారుకు రూ.35 వేలు, టమాటా, బొప్పాయి, పుచ్చ, పూలు,నర్సరీలకు రూ.25 వేలు, పండ్ల తోటలకు రూ.35 వేలు, ఆయిల్ పామ్, కొబ్బరి చెట్టుకు రూ.1,500 చొప్పున పరిహారం అందించనున్నారు.

# బ్యాగ్ బరువు తగ్గిద్దాం



- కొన్ని సబ్జెక్టులను కలిపి ఒకే పుస్తకం.. ప్రాథమిక స్థాయిలో అన్నింటికీ ఒక్కటే
- మరింత నాణ్యతతో పాఠ్యప్రణాళిక.. ఓఎంఆర్ స్థానంలో డిజిటల్ అసెసమెంట్
- సీబీఎస్ఈ తరహాలో ఇంటర్నల్ మార్కుల విధానం అమలుపై అధ్యయనం
- ఉన్నత విద్యలో 50% జీఈఆర్ లక్ష్యం.. మార్చికి వీసీల

**నియామకం: లోకేశ్**

**విజయవాడ, జనవరి 7 (జనస్వరం) :** పాఠశాల స్థాయిలో విద్యార్థులకు పుస్తకాల బరువు తగ్గాలని మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. బరువు తగ్గించి, నాణ్యత పెరిగేలా నూతన పాఠ్య ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. పాఠశాల, ఇంటర్మీడియట్, ఉన్నత విద్యాశాఖలపై మంగళవారం సమీక్ష నిర్వహించారు. 'ఏపీ మోడల్ ఎడ్యుకేషన్' లక్ష్యంగా సంస్క రణలు తీసుకురావాలని ఆదేశించారు. పాఠశాల విద్యలో ఓఎంఆర్ షీట్‌ల స్థానంలో డిజిటల్ అసెసమెంట్ చేస్తే విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుందని, ప్రభుత్వానికి ఖర్చు తగ్గుతుందని చెప్పారు. జీవో 117కు ప్రత్యామ్నాయం విషయంలో ఎమ్మెల్యేలు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల అభిప్రాయాలు తీసుకోవాలని తెలిపారు. ప్రస్తుతం విద్యార్థులకు రెండు సెమిస్టర్లకు వేర్వేరుగా పుస్తకాలు ఇస్తున్నారు. ఇకపై ప్రతి సబ్జెక్టుకు ప్రత్యేకంగా పుస్తకం అక్కర్లేకుండా, కొన్ని సబ్జెక్టుల ను కలిపి ఒకే పుస్తకంగా తీసుకొచ్చే విధానాన్ని అధికారులు వివరించారు. ప్రాథమిక స్థాయిలో మొత్తం సబ్జెక్టులు ఒకే పుస్తకంలో ఉండాలని, పైతరగతుల్లో ప్రస్తుతం ఉన్న పుస్తకాలను సగానికి తగ్గించి, రెండు, మూడు సబ్జెక్టులు ఒకే పుస్తకంలోకి తేవాలనే ప్రతిపాదనలు చేశారు. దీనిని మరోసారి పరిశీలించి, నిర్ణయించాలని మంత్రి ఆదేశించారు. విమర్శలకు తావులేకుండా పారదర్శకంగా డీఎస్సీ పూర్తిచేసేందుకు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇంటర్ విద్యలో గత పదేళ్లుగా ఎలాంటి సంస్కరణలు తీసుకురాలేదన్నారు. ప్రీఫైనల్ పరీక్షలు జనవరి నాటికి పూర్తిచేసేలా అకడమిక్ క్యాలెండర్ రూపొందించాలని ఆదేశించారు. సంస్కరణలు ప్రవేశపెట్టే ముందు విద్యారంగ నిపుణులు, తల్లిదండ్రుల సలహాలు తీసుకోవాలని స్పష్టం చేశారు. గణితంలో ఒకే పేపర్, బోటనీ, జువాలజీ కలిపి ఒకే పేపర్ నిర్వహించడంపైనా చర్చించారు. సీబీఎసఈ తరహాలో ఇంటర్నల్ మార్కుల విధానం అమలుపై అధ్యయనం చేయాలని లోకేశ్ సూచించారు. యూనివర్సిటీల వీసీలు, సలహా మండలి సభ్యుల నియామకాలు మార్చి నాటికి పూర్తికావాలన్నారు. ఉన్నత విద్యలో స్థూల ప్రవేశాల నిష్పత్తి(జీఈఆర్)ను 36 శాతం నుంచి 50 శాతానికి పెంచేలా చర్యలుండాలని ఆదేశించారు.

**పాలిటెక్నిక్ శిక్షణలో మార్పులు : మంత్రి నారా లోకేశ్**

మేక్ ఇన్ ఇండియాకు అనుగుణంగా పాలిటెక్నిక్ శిక్షణలో మార్పులు తీసుకొస్తామని మంత్రి నారా లోకేశ్ అన్నారు. విజయవాడలోని ఎస్ఎస్ కన్వెన్షన్ హాలులో 2 రోజులపాటు నిర్వహించిన పాలిటెక్ ఫెస్ట్- 2025 ముగింపు వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు. తొలుత పాలిటెక్నిక్ విద్యార్థులు రూపొందించిన 243 వైజ్ఞానిక ఆకృతులను తిలకించి, వాటి గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం లోకేశ్ మాట్లాడుతూ రాష్ట్రంలో వచ్చే ఐదేళ్లలో రూ.8వేల కోట్ల విలువైన పరిశ్రమల స్థాపన దిశగా అడుగులేస్తున్నామన్నారు. రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా ప్రతి నగరంలో విద్యార్థుల నుంచి వినూత్న ఆలోచనలు తీసుకుంటామని చెప్పారు. ప్రతి జిల్లాకు ఒక్కో ప్రాజెక్టు తీసుకొచ్చే విధంగా పలు సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు పేర్కొన్నారు.


## ప్రధాని విశాఖ సభ

# ఏర్పాట్ల పరిశీలన



**విశాఖపట్నం, జనవరి 7 (జనస్వరం) :** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బుధవారం విశాఖలో పర్యటిస్తారు. రోడ్ షో అనంతరం ఏయూ ఇంజినీరింగ్ కళాశాల గ్రౌండ్స్‌లో నిర్వహించే బహిరంగ సభలో పాల్గొంటారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పాల్గొంటారు. రోడ్ షో, సభ ఏర్పాట్లను రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పరిశీలించారు. సభా ప్రాంగణం వద్ద బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్, సుందరపు విజయ్ కుమార్, జనసేన పార్టీ నేతలతో రోడ్ షో, సభ విజయవంతంపై చర్చించారు.

## జీవితం - వి"చిత్రం"




## ఈ రోజు పంచాంగం వేళలు

తేదీ : 01 జనవరి 2025,
తిథి : శుద్ధ పాడ్యమి (తె.03:25వ.కు), శుద్ధ విదియ (02తా తె.02:26 వ.కు), నక్షత్రం : ఉ/షాఢ (రా.11:48వ.కు),
బ్రహ్మ ముహూర్తం : తె.04:55ల తె.05:43
రాహుకాలం : మ.12:01ల మ.01:23,
యమగండం : ఉ.07:54 ఉ.09:16,
వర్జ్యకాలం : ఉ.08:01ల ఉ.09:16,

## ఈ రోజు నమాజ్ వేళలు

తేదీ : 01 జనవరి 2025
ఫజర్ : తెల్లవారుజామున గం. 05:29
సూర్యోదయం : ఉదయం గం. 06:44
జొహర్ : మధ్యాహ్నం గం. 12:24
అసర్ : సాయంత్రం గం. 03:38
మఘ్రిబ్ : సాయంత్రం గం. 06:02
ఇష : రాత్రి గం. 07:18





జనస్వరం

విలేకరులు కావలెను

"జనస్వరం" ఈ-దినపత్రిక (వెబ్ పత్రిక) నందు పని చేయుటకు
రెండు తెలుగు రాష్ట్రాల్లో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి విలేకరులు కావలెను..
అసక్తి ఉన్న వారు సంప్రదించండి..
సాయి కళ్యాణ్
ఫోన్ నెం : 7013030690
మేనేజింగ్ డైరెక్టర్, జనస్వరం మీడియా

# కోరిన కోర్కెలు నెరవేరాలా..

### వైకుంఠ ఏకాదశి రోజున ఈ వస్తువులు దానం చేయండి..

హిందూ మతంలో వైకుంఠ ఏకాదశి చాలా ప్రత్యేకంగా పరిగణించబడుతుంది. ఈ రోజు శ్రీ మహా విష్ణువుకు అంకితం చేయబడింది. వైకుంఠ ఏకాదశి రోజున ఉపవాసం ఉండి శ్రీ మహా విష్ణువును పూజించే సంప్రదాయం ఉంది. హిందూ విశ్వాసాల ప్రకారం ఈ రోజున ఉపవాసం, పూజలు చేసిన వారికి మరణానంతరం మోక్షం లభిస్తుంది. ఈ రోజున శ్రీ మహా విష్ణువును పూజించి వ్రతాన్ని ఆచరించిన వారి పాపాలు నశిస్తాయని శ్రీ మహా విష్ణువు అనుగ్రహం లభిస్తుందని నమ్మకం. హిందూ క్యాలెండర్ ప్రకారం ఈ సంవత్సరం వైకుంఠ ఏకాదశి జనవరి 9 మధ్యాహ్నం 12:22 గంటలకు ప్రారంభమవుతుంది. ఈ తిథి మర్నాడు అంటే జనవరి 10 ఉదయం 10:19 గంటలకు ముగుస్తుంది. అటువంటి పరిస్థితిలో ఉదయ తిథి ప్రకారం, వైకుంఠ ఏకాదశి ఉపవాసం జనవరి 10న ఆచరించాల్సి ఉంటుంది. ఈ రోజున శ్రీమహావిష్ణువును పూజించడం, ఉపవాసం ఉండడంతో పాటు దానధర్మాలు చేయడం కూడా చాలా పుణ్యంగా భావిస్తారు. కనుక వైకుంఠ ఏకాదశి రోజున ఏయే వస్తువులు దానం చేయడం శుభప్రదమో తెలుసుకుందాం.

**ఏ వస్తువులను దానం చేయాలంటే..**

- వైకుంఠ ఏకాదశి రోజున పేదలకు అన్నం, బట్టలు, డబ్బు దానం చేయడం శుభప్రదం అని నమ్మకం. ఇలా చేయడం వల్ల పుణ్యఫలం లభిస్తుంది.
- ఈ రోజున తులసి మొక్క, దుప్పటి, ధాన్యాన్ని కూడా దానం చేయడం మంచిది. ఇలా చేయడం వలన పుణ్యం కలుగుతుందని.. శ్రీ మహా విష్ణువు అనుగ్రహం లభిస్తుందని నమ్మకం.
- ఈ రోజున గోవును దానం చేసే సంప్రదాయం కూడా ఉంది. ఇలా చేయడం వల్ల సకల సిరి సంపదలు లభిస్తాయని.. సమాజంలో గౌరవం లభిస్తుందని నమ్మకం.



**ఏ పనులు చేయవద్దంటే..**

వైకుంఠ ఏకాదశి రోజున మనసులో ప్రతికూల ఆలోచనలు చేయవద్దు.
ఈ రోజు అబద్ధం చెప్పకూడదు.
ఈ రోజు కోపం తెచ్చుకోకూడదు.
ఈ రోజున మాంసాహారం తినకూడదు.
ఈ రోజున ఉల్లిపాయలు, వెల్లుల్లి తీసుకోవద్దు.

## ఎడిటోరియల్

**వైకుంఠ ఏకాదశి ప్రాముఖ్యత :**

వైకుంఠ ఏకాదశి రోజు మతపరంగా చాలా ముఖ్యమైందిగా పరిగణించబడుతుంది. ఈ రోజున శ్రీ మహా విష్ణువును ఆరాధించడం, ఉపవాసం ఉండడం వల్ల మనసులోని మాలిన్యాలు తొలగిపోతాయి. మనస్సు స్వచ్ఛంగా, పవిత్రంగా మారుతుంది. ఈ రోజున శ్రీ మహా విష్ణువును పూజించడం, ఉపవాసం ఉండడం వల్ల ఇంట్లోని కష్టాలు తొలగిపోతాయి. అంతే కాదు ఆనందం, సుఖ సంతోషాలు ఎల్లప్పుడూ ఇంట్లో ఉంటాయి. ఈ రోజున పూజలు చేసి ఉపవాసం ఉండేవారు మోక్షం లభిస్తుదని.. స్వర్గానికి చేరుకుంటారని నమ్మకం. మరణానంతరం మరు జన్మ లేకుండా మోక్షాన్ని పొంది వైకుంఠ ధామంలో స్థానం పొందుతారని నమ్మకం.

**నోట్ :** పైన తెలిపిన విషయాలు పలువురు పండితుల సూచనలు, వారి తెలిపిన అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే.. వీటిలో ఎలాంటి శాస్త్రీయ ఆధారాలు లేవని పాఠకులు గమనించాలి.



**జమ్ము సాయి కల్యాణ్,**
**పొలిటికల్ అనలిస్టు,**
**మేనేజింగ్ డైరెక్టర్,**
**జనస్వరం మీడియా.**


## పాడి రైతులు పశువులకు సమయానికి వ్యాధి నివారణకు టీకాలు వేయించాలి



**దెందులూరు, జనవరి 7 (జనస్వరం) :** మండలంలోని రైతులందరూ తమ పశువులు పాడి పశువులకు చలికాలంలో బ్రహ్మ వ్యాధి, గాలి కుంటి వ్యాధి బారిన పడకుండా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో అందించే ఉచిత టీకాలను పశువులకు తప్పనిసరిగా వేయించాలని కొవ్వలి పశువైద్య శాఖ అధికారి డాక్టర్ కే.రామమోహన్ రావు అన్నారు. మంగళవారం కొవ్వలి పశువైద్య శాఖ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ చలి ఎక్కువగా ఉన్న నేపథ్యంలో పశువులను చలిలో ఉంచకుండా పాకలో పశువులను ఉంచాలన్నారు. పశువులను కట్టేసే ప్రదేశంలో బురద, మురుగు నిలవ లేకుండా ఎప్పటికప్పుడు పొడి ప్రదేశంలో పశువులను మారుస్తూ ఉండాలని పశువుల దూడలకు మూడు నెలలకు ఒకసారి తప్పనిసరిగా నత్త నివారణ మందులు వేయించాలని డాక్టర్ కె రామ్ మోహన్ రావు రైతులకు సూచించారు.

### రైతు సంఘం జిల్లా నాయకులు, గంగన్నగూడెం గ్రామ ప్రముఖులు

## ముసునూరు సీతారామయ్య మృతి



**దెందులూరు, జనవరి 7 (జనస్వరం) :** సమైక్యాంధ్ర ఉద్యమంతో పాటు రైతులకు సాగునీరు ప్రతి రైతుకు అందెందుకు ఎన్నో పోరాటాలు చేసి అధికారుల మన్ననలను పొందిన దెందులూరు మండ లం గంగన్న గూడెం గ్రామానికి చెందిన ప్రముఖులు, రైతు సంఘం నేత, వైసీపీ సీనియర్ నాయకులు ముసునూరి సీతారామయ్య అనారోగ్యంతో ఆయన నివాసం మృతి చెందారు. ఆయన గ్రామా ల్లో చెరువులు, సాగునీటి కాలువల అభివృద్ధి సంక్షేమానికి ఎన్నో పోరాటాలు చేయడంతో పాటు పలువురు జిల్లా కలెక్టర్లకు ఇరిగేషన్ అధికారులకు నీటి సమస్యను పరిష్కరించడంలో మంచి పేరు సంపాదించారు. ఈ సందర్భంగా సీతారామయ్య మృతితో పలువురు ఆయన భౌతిక కాయాన్ని సంద ర్శించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.

## వైసీపీ నేతలకు జిల్లా పదవులు





**దెందులూరు, జనవరి 7 (జనస్వరం) :** నియోజకవర్గంలో వైసీపీ నేతలను జిల్లా పదవుల్లో నియమిస్తూ వైసీపీ రాష్ట్ర అధ్యక్షులు మాజీ సీఎం వైఎస్ జగన్ లిఖిత పూర్వక ఆదేశాలు జారీ చేశారు. దెందులూరు ఏఎంసీ మాజీ చైర్మన్‌గా పని చేసిన మేకా లక్ష్మణరావును వైసీపీ ఏలూరు జిల్లా ఉపా ధ్యక్షుడిగా నియమించారు. వైసీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షునిగా పనిచేసిన ఆళ్ల సతీష్ చౌదరిని జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ మెంబర్గా పని చేసిన కత్తుల రవికుమార్‌ను వైసీపీ ఏలూరు జిల్లా అధికార ప్రతినిధిగా నియమించారు. దెందులూరు ఏఎంసి వైస్ చైర్మన్గా పనిచేసిన కాటి సుధాకర్ ను వైసీపీ ఏలూరు జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమించారు. పార్టీ యువ నాయకులు డివిఆర్కే చౌదరిని వైసీపీ జిల్లా కార్యదర్శిగా నియమించారు.

## డొక్కా సీతమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం



**విజయవాడ, జనవరి 7 (జనస్వరం) :** డొక్కా సీతమ్మ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు విజయ కుమారి ఆధ్వర్యంలో మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు విజయలక్ష్మి, జ్యోతిశ్వరి, బేబీ రాణి, ప్రశాంతి, సుబ్రహ్మణ్యం, రాణి, ఉమామహేశ్వరి, బుజ్జి, లీల పాల్గొన్నారు. సేవా కార్యక్రమంలో పాల్గొన్న వారందరూ ఎంతో ఆసక్తిగా సహకారం అందించారు. ట్రస్ట్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు సామాజిక సేవా రంగంలో ప్రశంసలు పొందుతున్నాయి.

## సేవకు చిరునామా.. 'నడపన జగపతి'



**పాలకొల్లు, జనవరి 6 (జనస్వరం) :** నిజమైన సేవకు చిరునామాగా నిలిచారు నడపన జగపతి రావు. పాలకొల్లు మండలం తిల్లపూడి గ్రామంలో ఓ చిన్న రైతు కుటుంబంలో జన్మించారాయన. ఐటిఐ చదువుకొని ఎలక్ట్రీషన్‌గా జీవితాన్ని ప్రారంభించిన నడపన జగపతి, అనతికాలంలోనే ఇంతింతై వటుడింతై అన్నచందంగా అసమాన్యుడిగా ఎదిగారు. మంచి మనసున్న మనిషిగా, సేవకు ప్రతిరూపంగా, పాలకొల్లు నియోజకవర్గ వ్యాప్తంగా పేరు తెచ్చుకున్నారు. నిరంతరం అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ, నేడు అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. డబ్బు సంపాదించడం గొప్ప కాదని, సంపాదించిన డబ్బును సక్రమంగా వినియోగించడం, ఉన్నంతలో పదిమందికి సహాయపడడం గొప్ప లక్షణమని ఆయన తరచు అంటూ ఉంటారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న అనేకమంది పేదలకు, ఆపన్నులకు జగపతి సహాయం చేస్తున్నారు. ఆపదలో ఉన్న వారికి సహాయపడడం, మంచి పనులకు నేనున్నానంటూ ముందు ఉండడం ఆయనకు నిత్య కృత్యంగా మారిందంటే అతిశయోక్తి కాదు. సమాజ సేవలోనే కాదు.. విద్యారంగానికి చెందిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలలో సైతం, విద్యార్థులకు అవసరమైన సహాయ సహకారాలను అందించడంలో తనదైన మార్కు వేసుకున్నారు నడపన జగపతి. విద్యార్థులకు అవసరమైన వసతుల కల్పన చేయడంలో, చేయూతను అందించడంలో ఎల్లవేళలా ముందుంటూ.. విద్యార్థుల పురోగతికి ఎంతగానో దోహదపడుతున్నారు. అడిగిందే తడవుగా పాఠశాలలలో అవసరమైన అవసరమైన మౌలిక సదుపాయాలనూ కల్పిస్తూ, దాతృత్వాన్ని చాటుకుంటున్నారు. ఇక రాజకీయ రంగంలో సైతం ప్రవేశించి, ప్రజల మన్ననలు అందుకుంటున్నారీయన. మంచి వ్యక్తిత్వం కల వ్యక్తిగా పేరు తెచ్చుకున్నారు. పట్టుదల కార్యదక్షతలతో అహర్నిశలు శ్రమించి నేడు పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ విషయమై జనస్వరం ప్రతినిధితో జగపతి మాట్లాడుతూ.. సేవ చేయడంలో ఉండే ఆనందం వెలకట్టలేనిదన్నారు. తల్లిదండ్రులు చిన్ననాటి నుండే తమ పిల్లలకు సేవా భావాన్ని నేర్పాలని, ఉన్నంతలో పదిమందికి సహాయం చేసినప్పుడే జన్మ సార్థకం అవుతుందని చెప్పారు. భవిష్యత్తులో తన సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తామని వెల్లడించారు.

## కోడి పందాలు నిర్వహించడం చట్టరీత్యా నేరం

- **కోడిపందాల నివారణకు తగిన చర్యలు**
- **జిల్లా కలెక్టర్ ఆనంద్**



**నెల్లూరు, జనవరి 7 (జనస్వరం) :** సంక్రాంతి పండుగ నేపథ్యంలో జిల్లాలో ఎక్కడా కూడా కోడి పందాలు నిర్వహించకుండా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం కలెక్టరు చాంబర్‌లో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో జంతుహింస నివారణ చట్టం అమలుపై ఎగ్జిక్యూటీవ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగకు గ్రామాల్లో కోడిపందాలు నిర్వహించడం నేరమన్నారు. కోడి పందాలు జరగకుండా గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. గ్రామ, మండల, డివిజన్, జిల్లా స్థాయిలో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి కోడిపందాలు నిర్వహించకుండా చూడాలన్నారు. ఈ కమిటీల్లో పోలీసు, రెవెన్యూ, పంచాయతీ అధికారులు సభ్యులుగా వుండి గ్రామాల్లో కోడిపందాలు, ఇతర ఘర్షణ వాతావరణం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. నిబంధనలను అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేయాలని పోలీసులకు సూచించారు. ఈ సమావేశంలో పశు సంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ రమేష్ నాయక్, ఏఎస్పీ సౌజన్య, డిఎఫ్ఓ మహబూబ్‌బాషా, జడ్పీ సీఈవో విద్యారమ, డిపివో శ్రీధర్‌రెడ్డి, ఏడి మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

## పడకేసిన పారిశుధ్యం.. పట్టించుకోని అధికారులు



**వరరామచంద్రపురం, జనవరి 7 (జనస్వరం) :** మండలంలో వడ్డెగూడెం పంచాయితీ విఆర్ పురం సెంటర్ నందు ఇందిరా గాంధీ సెంటర్ నుండి అంబేద్కర్ కాలనీ వరకు డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. రెండు నెలలుగా పూడికతీత పనులు చేపట్టలేదు. అందుమూలంగా డ్రైనేజీ దుర్గంధం వెదజల్లుతుంది. దీంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని గ్రామస్తులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఈ రోడ్డు గుండా రాకపోకలు సాగించే స్థానిక గ్రామస్తులు, కళాశాల విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. దోమలు వ్యాప్తి చెందడంతో ఆ చుట్టు పక్కలనున్న నివాస గృహాల వారు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం కాలంలో అప్పుడప్పుడు పెద్ద వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో దుర్వాసనతో పాటు దోమలు మరింత వద్ధి చెందే అవకాశం ఉందని దానివల్ల వ్యాధులు మరింత ప్రభలే అవకాశముంటుందని స్థానికులు భయపడుతున్నారు. తక్షణమే పంచాయతీ అధికారులు స్పందించి డ్రైనేజీలో పేరుకుపోయిన పారిశుధ్యన్ని వెంటనే తొలగించి, భవిష్యత్తులో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### సర్వజన ఆసుపత్రిలో బాలింతలు, గర్భిణుల వార్డులలో

## దారం అనిత ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీ





**మదనపల్లె, జనవరి 7 (జనస్వరం) :** సర్వజన ఆసుపత్రిలో బాలింతలు, గర్భిణుల వార్డులను జనసేన రాష్ట్ర కమిటీ సభ్యులు, రాయలసీమ రీజనల్ కోఆర్డినేటర్ దారం అనిత ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. బాలింతలు, గర్భిణులకు అందిస్తున్న ఆహారం నాణ్యతను దారం అనిత స్వయంగా పరిశీలించారు. వారి ఆరోగ్యం కోసం సరైన ఆహారం అందించాల్సిన అవసరాన్ని సిబ్బందికి తెలియజేశారు. ఆసుపత్రిలో 40 మంది గర్భిణులకు, బాలింతలకు అందుబాటులో ఉన్న వైద్య సేవలు, సదుపాయాలను సమీక్షించారు. మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఉన్న రోగుల నుంచి ఫీడ్‌బ్యాక్ సేకరించిన దారం అనిత, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవల్లో ఎక్కడైనా లోపాలు ఉంటే వెంటనే సరిచేయాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జనసేన పార్టీ ప్రజల ఆరోగ్యం పట్ల అత్యంత ప్రతిబింబం చూపుతుందని, రోగులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యమని తెలిపారు. బాలింతలు, గర్భిణుల ఆరోగ్యం పట్ల మరింత జాగ్రత్తలు తీసుకోవాలని, ఆసుపత్రి సేవలను నిరంతరం మెరుగుపరచాలని ఆమె హితవు పలికారు.

జన స్వరం
www.janaswaram.com
తెలంగాణ

# ఉచిత రొమ్ము క్యాన్సర్ పరీక్షలపై అవగాహన కార్యక్రమం

## ప్రకటించిన గ్రాన్యూల్స్ ఇండియా, ఏఐజి హాస్పిటల్స్




**హైదరాబాద్, జనవరి 7 (జనస్వరం) :** గ్రాన్యూల్స్ ఇండియా లిమిటెడ్ ఇంకా ఏఐజి హాస్పిటల్స్ తమ 'బ్రెస్ట్ హెల్త్ ఎక్స్‌ప్రెస్'- మొబైల్ బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్, అవగాహన కార్యక్రమాన్ని మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా గ్రామీణ వర్గాల ప్రజలకు అందించడానికి విస్తరింపజేస్తున్నట్లు ప్రకటించాయి. ఏషియన్ మెడికల్ ఫౌండేషన్, యుసి బ్రెస్ట్ ఫౌండేషన్‌ల సహకారంతో చేపట్టిన ఈ కార్యక్రమం, సామాజిక-ఆర్థిక స్థితితో సంబంధం లేకుండా మహిళలందరికీ రొమ్ము క్యాన్సర్ నివారణ ఆరోగ్య సంరక్షణను అందుబాటులోకి తీసుకురావడానికి ఒక ముందడుగు. గాగిల్లాపూర్ గ్రామంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మొబైల్ స్క్రీనింగ్ యూనిట్ అత్యాధునిక సౌకర్యాలు, బ్రెస్ట్ క్యాన్సర్ అవగాహన కోసం రూపొందించిన కార్యాచరణ, ముందస్తుగా గుర్తించే సమగ్ర విధానాన్ని ప్రదర్శించారు. విలేకరుల సమావేశంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వైద్య అండ్ ఆరోగ్య అధికారి, డాక్టర్ టి. రఘునాథ స్వామి, అధునాతన రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్ సేవలను జిల్లాలోని మహిళలందరికీ నేరుగా అందించడానికి రూపొందించిన కార్యక్రమాన్ని వివరించారు. గ్రాన్యూల్స్ ఇండియా లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉమా చిగురుపాటి, ఈ కార్యక్రమం వ్యూహాత్మక ప్రాముఖ్యతను చెబుతూ, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాతో మొదలుపెట్టి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బ్రెస్ట్ హెల్త్ ఎక్స్‌ప్రెస్ కార్యక్రమం విస్తరించడానికి కట్టుబడి ఉన్నామన్నారు. అవసరమైన స్క్రీనింగ్ సేవలను నేరుగా గ్రామీణ వర్గాల చెంతకు తీసుకురావడం ద్వారా, రొమ్ము ఆరోగ్యం పై అవగాహన పెంచుతూ ఆరోగ్య సంరక్షణకు అడ్డంకులను తొలగిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం, మహిళల భౌగోళిక లేదా ఆర్థిక పరిస్థితులతో సంబంధం లేకుండా ప్రతి స్త్రీకి నివారణ రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్ అందుబాటులో ఉండాలనే నమ్మకాన్ని ప్రతి బింబిస్తుందన్నారు. ఏఐజి, కన్సల్టెంట్ బ్రెస్ట్ ఆంకాలజిస్ట్ యుసి బ్రెస్ట్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ ప్రజ్ఞ చిగురుపాటి ఈ కార్యక్రమం వైద్య ప్రాముఖ్యతను వివరించారు.

## చైనా మాంజా వాడితే జైలు శిక్షే



**భైంసా, జనవరి 7 (జనస్వరం) :** సంక్రాంతి పండుగ సందర్భంగా ఎగరేసే గాలిపటాల కోసం చైనా మాంజాను ఉపయోగించినా, అమ్మినా, నిల్వ చేసినా వారిపై కఠినంగా వ్యవహరిస్తామని పట్టణ సీఐ గోపీనాథ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని వివిధ పతంగుల దుకాణాల్లో తనిఖీలు చేపడుతూ మాంజాతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్నారు. సీఐ గోపీనాథ్ మాట్లాడుతూ పక్షుల పాలిట యమ పాశాలుగా మారుతున్న చైనా మాంజా విక్రయాలను అరికట్టేందుకు తనిఖీ చేస్తున్నామని, చైనా మాంజా అమ్మితే దుకాణాల నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తున్నామని హెచ్చరించారు. పర్యావరణ పరిరక్షణకు అందరూ బాధ్యత వహించాలని, చైనా మాంజాను ఎవరూ వాడొద్దని సూచించారు. ఇందుకు ప్రజలు కూడా పూర్తి బాధ్యత వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలే దీన్ని ఒక బాధ్యతగా వహించి పోలీసులకు సమాచారం ఇవ్వాల్సిందిగా కోరారు. గాలి పటం పండగను పురస్కరించుకొని తల్లిదండ్రులు కూడా ఎప్పటికప్పుడు తమ పిల్లలు తగు జాగ్రత్తలు తీసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. చైనా మంజా వ్యర్థాల వల్ల పక్షులతోపాటు మనుషులకు హాని కలుగుతోందని, గత ఏడాది ఈ మాంజా కారణంగా హైదరాబాద్‌లో ఒకరు, ఢిల్లీలో మరోకరు చనిపోయారని గుర్తు చేశారు. జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు 2017, జులై 11 నుంచి తెలంగాణా తో సహా దేశంలో చైనా మాంజాను నిషేధించినట్లు తెలిపారు.రాష్ట్రంలోచైనా మాంజా వాడకం నిషేధానికి పోలీసు, ఇతర స్వచ్ఛంద సంస్థలు, మీడియా సహకారం తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

## సివిల్ సప్లైకార్మికుల సమ్మెకు జనసేనపార్టీ మద్దతు




**భైంసా, జనవరి 7 (జనస్వరం) :** పట్టణంలోని సివిల్ సప్లయ్ కార్మికులు 7 రోజులుగా తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేస్తున్న విషయం అందరికి తెలిసిందే. ఈ సందర్భంగా జనసేన పార్టీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు సుంకేట మహేష్ బాబు హమాలీలు చేస్తున్న నిరసన చేస్తున్న కార్మికులకు మద్దతు తెలిపారు. వారు మాట్లాడుతూ హమాలీలకు కూలి రేట్లు పెంచాలని, గతంలో కమిషనర్ దగ్గర జరిగిన కూలి రెట్ల ఒప్పంద జిఓను వెంటనే విడుదల చేయాలని కోరారు. హమాలీల సమ్మె ద్వారా రాష్ట్రంలో బియ్యం పంపిణి నిలిచి పోయే పరిస్థితి వచ్చిందాని వారు కోరుతున్న డిమాండ్స్ పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి కూలి రెట్లను పెంచాలి, కాని కాంగ్రెస్ ప్రభుత్వం అస్సలు పట్టించుకోవడం లేదునీ సాధారణ హమాలీల పరిస్థితి ఇలా ఉంటే సామాన్యుడు పరిస్థితి గురించి ఇంకా చెప్పాల్సిన అవసరం లేదని ఆరోపించారు. సమస్య పరిష్కారం కాక పొతే భవిష్యత్ లో జరగబోయే పోరాటానికి జనసేన పూర్తి స్థాయిలో మద్దతూ ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హమాలీ సంఘం అధ్యక్షులు ముత్యం, టీడీపీ జిల్లా అధ్యక్షులు తెలిరాజు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు మానసిక ఒత్తుడిని అధగమించాలి




**పెద్దపల్లి, జనవరి 7 (జనస్వరం) :** జిల్లాలోని మంథని పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మంథనిలో ఇంటర్మీడియెట్ విద్యాశాఖ ఆదేశాల మేరకు మంగళవారం రోజు 'టెలి మానస్' ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ కోట ఉష సూచనల మేరకు విద్యార్థులకు టెలి మానస్ కౌన్సిలర్లు డా.ఓర్సు రాయలింగు, ఇనుములపల్లి జ్యోతి విద్యార్తులకు పరీక్షల వల్ల భయం పొగట్టడం, మానసిక ఒత్తిడిని జయించడం ఎలాగో చెప్పడం జరిగింది. విద్యార్థులను ఉద్దేశించి టేలి మానస్ కౌన్సిలర్లు మాట్లాడుతూ "రానున్న పరీక్షలలో భయాన్ని విడిచి ఆత్మస్థైర్యంతో ముందుకు ఎలా వెళ్ళాలి, మానసిక ఒత్తిడిని ఎలా జయించాలి, పట్టుదలతో చదివితే విద్యార్థులు విజయం సాధిస్తారని, ఖచ్చితమైన ప్రణాళిక వేసుకొని చదివితే తప్పకుండా పరీక్షలలో ఉత్తీర్ణులౌతారని తెలిపారు. విద్యార్థులు ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా ఉండి అధ్యాపకులు చెప్పిన పాఠ్యాంశాలను ఎప్పటికప్పుడు చదువుతూ, రాస్తూ ఉంటే తప్పకుండా పరీక్షలలో విజయం పొందుతారని కౌన్సిలర్ ఇనుములపల్లి జ్యోతి తెలిపారు. అలాగే కళాశాల ప్రధానాచార్యులు కోట ఉష మాట్లాడుతూ విద్యార్థులు మానసిక దృఢత్వాన్ని కలిగి ఉండి, చదువును శ్రద్ధగా చదివితే తప్పకుండా పాస్ అవుతారని, విద్యార్థులు మనుసు పెట్టి పట్టుదలతో కష్టపడి చదివితే ఎటువంటి భయాలు లేకుండా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## తహశీల్దార్ ఆనంద్‌రావును విధుల నుండి తొలగించాలి


### బుస్స చంద్రయ్య



**బొంరాస్‌పేట, జనవరి 7 (జనస్వరం) :** గతంలో దుద్యాల తహసిల్దార్‌గా పనిచేసిన ఆనందరావు మండల పరిధిలోని గౌరారం గ్రామానికి చెందిన సర్వే నెంబర్ 57/2లో 1.13 గుంటల భూమి అశోక్ తండ్రి వారసత్వంగా వచ్చిన భూమి తండ్రి మరణానంతరం కుమారుడు బోయిని అశోక్‌కు విరసత్ చేయవలసిన భూమి వేరే వ్యక్తుల నుండి లక్షల రూపాయలు డబ్బులు తీసుకొని అవినీతికి పాల్పడి సంబంధం లేని వ్యక్తులకు పట్టా చేసి అశోక్ అతని కుటుంబానికి అన్యాయం చేసిన ప్రస్తుతం పరిగి తహసిల్దార్‌గా పనిచేస్తున్న ఆనందరావును వెంటనే సస్పెండ్ చేయాలని మంగళవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయంలోని రికార్డు అసిస్టెంట్ లాలయ్యకు సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బుస్స చంద్రయ్య ఆధ్వర్యంలో బాధిత రైతులు వినతి పత్రం అందజేశారు. అనంతరం బుస్స చంద్రయ్య మాట్లాడుతూ ఆనందరావు దుద్యాల మండలంలో పని చేసిన రెండు నెలల్లో భూ సమస్యల పేరుతో అనేక అవినీతి అక్రమాలకు పాల్పడ్డాడని ఆరోపించారు. వెంటనే ఆనంద్ రావును సస్పెండ్ చేసి విధుల్లో నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బాధిత రైతులు అశోక్, వెంకటయ్య, మైసప్ప, మొగులప్ప, ఆశన్న, తదితరులు పాల్గొన్నారు.

## అందుబాటులో జీవన ఎరువులు.. రైతులు సద్వినియోగం చేసుకోవాలి




**బొంరాస్‌పేట, జనవరి 7 (జనస్వరం) :** జాతీయ ఆహార భద్రతా పథకంలో భాగంగా పాస్పెట్ సాలు బులైసింగ్ బ్యాక్టీరియా జీవన ఎరువుల ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని ఏఓ తులసి అన్నారు. మంగళవారం పలువురు రైతులకు జీవన ఎరువుల ప్యాకెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక్కో ప్యాకెట్‌కు 50 శాతం సబ్సిడీ పోను రూ.20 చెల్లించి రైతులు తీసుకెళ్లాలని కోరారు. అవసరమున్న రైతులు స్థానిక మండల కేంద్రంలోని రైతు వేదికలో పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ అందజేసి తీసుకెళ్లాలని కోరారు. జీవన ఎరువు నేల సారాన్ని మెరుగుపరచి రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని ఆయా ఏఈవోలు పాల్గొన్నారు.


## కళ్యాణ లక్ష్మి పేదలకు వరం : ఎమ్మెల్యే రామారావ్ పటేల్




**కుబీర్, జనవరి 7 (జనస్వరం) :** కళ్యాణ లక్ష్మి, ముఖ్యమంత్రి సహాయ నిధి, సంక్షేమ పథకాలు పేదలకు వరమని ఎమ్మెల్యే పవర్ రామారావ్ పటేల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంజూరైన కల్యాణి లక్ష్మి చెక్కులు ఎమ్మెల్యే రామారావ్ పటేల్‌తో పాటు బీజేపీ నాయకులు దత్తురాం పటేల్, సయ్యాజీ పలువురు నాయకులు చేతులు మీదుగా లబ్దిదారులు చందేనే అంబ్రా పాల ప్రకాష్ పాటు పలువురు లబ్ధిదారులకు అందచేశారు.

## విధులకు ఎగనామం పెడుతున్న ఉపాధ్యాయులు

### పట్టించుకోని విద్య శాఖ అధికారులు




**బొంరాస్‌పేట, జనవరి 7 (జనస్వరం) :** మండల పరిధిలోని ఏకోపాధ్యాయ పాఠశాలలో ఉపాధ్యాయులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. మండల పరిధిలోని టేకులగడ్డ తండాకు చెందిన ప్రధానోపాధ్యాయులు గౌరారం గోపాల్ యూనియన్ సమావేశాల పేరుతో విధులకు ఎగనామం పెట్టడంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని తండావాసులు ఆరోపించారు. ఇదే విషయమై ఎంఈఓ హరిలాల్ ను వివరణ కోరగా గతంలో నిర్వహించిన సమావేశాల్లో ఉపాధ్యాయులు తప్పనిసరిగా ఎంఆర్సిలో సెలవు సంబంధించిన దరఖాస్తు పెట్టుకోవాలని ఆదేశించిన పలువురు ఉపాధ్యాయులు ఆదేశాలను పట్టించుకోవడం లేదని వారిపై శాఖా పరమైన చర్యలు తప్పవన్నారు.

## విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు : పీడీ శ్రీనివాస్





**బొంరాస్‌పేట, జనవరి 7 (జనస్వరం) :** మండల పరిధిలోని ఏర్పుమళ్ళ గ్రామంలో నర్సరీని వికారాబాద్ జిల్లా డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్ పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశం మందిరంలో ఉపాధి హామీ, మండల మహిళా సమైక్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని వీధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పమన్నారు. నర్సరీలో వీలైనంతవరకు వెంటనే విత్తనాలు వేయాలని సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకన్ గౌడ్, ఏపీఓ ఇలియాస్, ఏపీఎం సత్యయ్య, టెక్నికల్ అసిస్టెంట్లు, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డించిన పీడీ శ్రీనివాస్





**బొంరాస్‌పేట, జనవరి 7 (జనస్వరం) :** వికారాబాద్ జిల్లా డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్ మంగళవారం మండల పరిధిలోని ఏర్పుమళ్ళ ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో అదనపు తరగతి గదులను, అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనం విషయంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీఓ వెంకన్ గౌడ్, ఏపీఎం సత్యయ్య, ఏపీఓ ఇలియాస్, పంచాయతీ కార్యదర్శి రమేష్ రాథోడ్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట్ రెడ్డి, ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్ సుజాత పాల్గొన్నారు.

## సీఎం రిలీప్ ఫండ్ చెక్కు అందజేత



**బొంరాస్‌పేట, జనవరి 7 (జనస్వరం) :** సీఎం రిలీప్ ఫండ్ పథకం పేద ప్రజలకు వరం లాంటిదని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నర్సింలు గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్ రాములు గౌడ్, సీనియర్ నాయకులు రామచంద్ర రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని నాందార్‌పూర్ గ్రామానికి చెందిన వడ్ల రాజుకు మంజూరైన రూ.లక్ష సీఎం రిలీఫ్ చెక్కును రాజు భార్య వడ్ల అనసూయకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లికార్జున్, కొడంగల్ మార్కెట్ కమిటీ సభ్యులు మల్లేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మహేందర్ సింగ్, కిష్టప్ప తదితరులు ఉన్నారు.

## గన్నేరువరం ఎంఆర్‌సీ కార్యాలయంలో టీచర్లే కొనసాగుతున్నారు

**గన్నేరువరం, జనవరి 7 (జనస్వరం) :** తెలంగాణ రాష్ట్రంలో సర్వ శిక్ష అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగులు సమ్మె విరమించినప్పటికీ, గన్నేరువరం ఎంఆర్‌సీ కార్యాలయంలో కొన్ని టీచర్లు కొనసాగుతున్నారని ప్రభుత్వ ఉపాధ్యాయులు, టీజీబీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాం. రాజయ్య ఆరోపించారు. వివరాల్లోకి వెళ్ళితే, కరీంనగర్ జిల్లా గన్నేరువరం ఎంఆర్‌సీ కార్యాలయంలో ప్రత్యామ్నాయంగా ఒక టీచర్‌ను "ఓరల్ డిప్యుటేషన్" (మౌఖిక ఆదేశాల) ఆధారంగా జిల్లా స్థాయి అధికారులు గన్నేరువరం మండలం ఇన్-చార్జ్ ఎంఈఓ రామయ్య ద్వారా మైలారం పాఠశాల నుండి డిప్యూటేషన్‌పై పంపించారు. అయితే, సమ్మె విరమించినప్పటికీ, ఈ టీచర్ గన్నేరువరం ఎం.ఆర్.సి. కార్యాలయంలో కొనసాగుతున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో రాం.రాజయ్య విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని, ఈ టీచర్‌ను మాతృ సంస్థ అయిన మైలారం పాఠశాలకు పంపాలని కోరారు.

# ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు "కిచెన్ గార్డెన్"

"చిరుధాన్యాలతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ"

శిక్షణ కార్యక్రమం



**పులివెందుల, జనవరి 7 (జనస్వరం) :** పులివెందులలోని ఆహార విజ్ఞాన శాస్త్ర, సాంకేతిక కళాశాల నాల్గవ సంవత్సరం ఎన్ఎస్-ఎస్ విద్యార్థి వాలంటీర్లు "జాతీయ సేవా పథకం"లో భాగంగా బ్రాహ్మణపల్లి గ్రామంలో ప్రత్యేక శిభిరాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం జనవరి 4 నుండి జనవరి 10 వరకు కొనసాగుతుంది. నాల్గవ రోజు, 07 జనవరి మంగళవారం, గ్రామంలో "కిచెన్ గార్డెన్ కార్యక్రమం" నిర్వహించారు. అనంతరం "చిరుధాన్యాలతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ ప్రదర్శన"ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో కిచెన్ గార్డెన్ తయారు చేశారు. పాఠశాల ఆవరణంలో నేలను చదును చేసి, పాలకూర, గోంగూర, తోటకూర, బెండకాయ, చిక్కుడు, గోరు చిక్కుడు, కాకరకాయ, ముల్లంగి విత్తనాలు నాటారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామస్తులకు స్వయంగా విత్తనాలు నాటడం, వాటి పెంపకం గురించి అవగాహన ఇవ్వడమే లక్ష్యంగా ఉంది. తర్వాత ఎన్.ఎస్.ఎస్ విద్యార్థులు రాగి, జొన్నలు ఇతర చిరుధాన్యాలతో కేక్‌లు తయారుచేసి వాటి తయారీ విధానాలను గ్రామస్థులకు ప్రదర్శించారు. ఈ సందర్భంగా, అధ్యాపకురాలు ఇంజనీర్ నజ్మా మాట్లాడుతూ, చిరుధాన్యాలతో విలువ ఆధారిత ఉత్పత్తుల ప్రాముఖ్యత, వాటి ఉపయోగాలు, పోషకాలు గురించి గ్రామస్తులకు విపులంగా వివరించారు. కొందరు గ్రామస్థులు, మైదాతో తయారు చేసిన కేక్‌లతో పోల్చినప్పుడు, కళాశాల వారు తయారు చేసిన చిరుధాన్య కేక్ రుచిగా, సులభమైన పద్దతిలో ఉందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో, అధ్యాపకుడు డాక్టర్ సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ, చిరుధాన్యాల ప్రాసెసింగ్ యంత్రాలు, శిక్షణా కార్యక్రమాలకు గ్రామస్తులు కళాశాలకు రాక ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, కళాశాల జాతీయ సేవా పథకం అధికారులు డాక్టర్ జయమ్మ, డాక్టర్ నివేదిత, అధ్యాపకులు ఇంజనీర్ నజ్మా, డాక్టర్ సాయి శ్రీనివాస్, ఎన్వి సుబ్బారెడ్డి, నాల్గవ సంవత్సరం ఎన్ఎస్ఎస్ విద్యార్థి వాలంటీర్లు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## వయోజన విద్య అక్షరాస్యత వాలంటీర్లకు పుస్తకాలు పంపిణీ



**దెందులూరు, జనవరి 7 (జనస్వరం) :** వయోజన విద్య ఉల్లాస్ అక్షరాస్యత ద్వారా శిక్షణ పొందిన డ్వాక్రా వాలంటీర్లు, నిరక్షరాసులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఏలూరు జిల్లా వయోజన విద్యా నోడల్ అధికారి కె.వి.వి సత్యనారాయణ అన్నారు. దెందులూరు మండల డ్వాక్రా భవనంలో శనివారం వయోజన విద్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉల్లాస్ అక్షరాస్యత కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపిడిఓ శ్రీదేవి చేతుల మీదుగా శిక్షణ పొందిన డ్వాక్రా వాలంటీర్లకు పుస్తకాలు పంపిణీ చేశారు. భీమడోలు మండలంలోని డ్వాక్రా గ్రూపు మహిళలలో మొదటి విడతగా 270 మంది నిరక్షరాసులను గుర్తించి, వీరందరినీ అక్షరాస్యులుగా చేసేందుకు 27 మంది వాలంటీర్లు నియమించినట్లు ఏపిఎం సురేష్ కుమార్ తెలిపారు. వీరంతా ఆయా గ్రామాల్లోని నిరక్షరాసులకు 3 నెలలు పాటు ప్రత్యేక తరగతులు నిర్వహించి ఉత్తీర్ణత కోసం పరీక్షలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డ్వాక్రా సిసిలు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులు లక్ష్య స్వాధనతో ముందుకు వెళ్లాలి..

ఇంటర్ విద్య విద్యార్థులకు భవిష్యత్తు..



**నంద్యాల, జనవరి 7 (జనస్వరం) :** ఇంటర్మీడియట్ విద్యా విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తుకు సూచికని కష్టపడి చదివి ఉన్నత ఆశయాలకు చేరుకోవాలని ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ చిత్తలూరి మధుసూదన్ రావు పేర్కొన్నారు. మంగళవారం నంద్యాల జిల్లాలోని గోస్పాడు మండలం దీబగుంట్ల జూనియర్ కళాశాలలో విద్యార్థులకు భవిష్యత్తుపై ప్రజెంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి ఇంటర్మీడియట్ చదువుతున్న పేద విద్యార్థులకు ఇంటర్మీడియట్ స్థాయిలో ఏ విధంగా లక్ష్యాన్ని ఏర్పరచుకోవాలి దానికి ఏ విధంగా సాధించాలో వివరించడం జరిగిందన్నారు. రెండు సంవత్సరాల ఇంటర్మీడియట్ భవిష్యత్ దర్శనం ద్వారా జీవితాన్ని ఆనందమయం చేసుకుంటూ ఏ విధంగా లక్ష్యాన్ని సాధించాలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. విద్యార్థి ఇంటర్ విద్యతో వారి భవిష్యత్తు ఉద్యోగ మారుతుందని, ఉన్నత విద్యకు ఇంటర్ విద్య మూలమన్నారు. ఇంటర్ కోర్సులో ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత స్థాయిని చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ బాలచంద్రుడు, శంభు ప్రసాద్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## గిరిజనేతర భూ స్వామిపై ఎస్టీ, ఎస్సీ కేసు నమోదు చేయాలి




**హుకుంపేట, జనవరి 7 (జనస్వరం) :** అనంతగిరి మండలంలో సీపీఎం నాయకులు జేష్ఠ వెంకట రమణ, ఆర్ శ్రీనుపై దాడి చేసిన గిరిజనేతర భూస్వామి బి నగేష్ పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలని గిరిజన సంఘం జిల్లా నాయకురాలు సొంటేన హైమావతి డిమాండ్ చేశారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ అనంతగిరి మండలం భీంపోలు పంచాయితీ సర్యపల్లి రెవిన్యూ పరిధిలో గల సర్వే నెంబర్ 66లో 13 ఎకరాల ప్రభుత్వ సీలింగ్ భూమిని విటోర్ రియల్ ఎస్టేట్ వెంచర్ యజమాని బి.నగేష్ జనవరి 3న ఆక్రమించి చదును చేస్తుండగా రెవిన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినందుకు కక్ష సాధింపు చర్యలకు పాల్పడి సీపీఎం నాయకులపై గుండాలతో రాత్రి దాడి చేసిన శ్రీనుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. 13 ఎకరాల ప్రభుత్వ సీలింగ్ భూమి ఆక్రమించిన గిరిజనేతర భూస్వామిపై 2024 లాండ్ గ్రాబింగ్ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి ఆక్రమించిన భూములు వెంటనే ప్రభుత్వం స్వాధీనం చేయలని డిమాండ్ చేశారు. గిరిజనులు తరతరాలుగా సాగుచేస్తున్న భూములను మైదానవాసులు ఆక్రమించి దౌర్జన్యం చేస్తూ భౌతికంగా దాడి చేసి భయభ్రాంతులకు గురిచేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, అలాగే ప్రభుత్వ భూములను కబ్జా చేసి స్థానికంగా ఉన్న గిరిజనులపై భౌతిక దాడి హత్యాయత్నం చేసిన వారిపై తక్షణమే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి, మెరకచింత మాజీ సర్పంచ్ వలసనైని లక్ష్మణ్ రావు, వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు, తడిగిరి, కొంతిలి వైస్ సర్పంచ్‌లు కిల్లో రామారావు, డూరు కృష్ణమూర్తి, నాయకులు తాపుల కృష్ణా రావు, గెమ్మెలి ఆనంద్, కొర్ర అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు



**దెందులూరు, జనవరి 7 (జనస్వరం) :** మండలంలోని పోతునూరు గ్రామపంచాయతీ పరిధిలోని ఉండ్రాజవరం గ్రామంలో ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభయాంజనేయ స్వామి వారికి తమలపాకులు సింధూరంతో ప్రత్యేక పూజలు చేసి ఉండ్రాజవరం గ్రామం చల్లగా ఉండేలా చూడాలని పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున అభయాంజనేయం స్వామిని దర్శించుకున్నారు. గ్రామస్తులు స్వామి వారికి భజనలు చేసి పూజలు నిర్వహించారు.

## విలేజ్ క్లినిక్‌ను సందర్శించిన జనసేన సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు



**సర్వేపల్లి, జనవరి 7 (జనస్వరం) :** నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు సర్వేపల్లి నియోజకవర్గంలోని పైనాపురం గ్రామపంచాయతీ పరిధిలోని అనంతపురం గ్రామంలోని విలేజ్ క్లినిక్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడో నెల జరుగుతున్నా, ఇంకా ప్రభుత్వ కార్యాలయాలు, క్లినిక్‌లపై వైఎస్సార్ పేరు కొనసాగుతున్నదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బొబ్బేపల్లి సురేష్ నాయుడు మాట్లాడుతూ, "మా అధినేత జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఐదేళ్లపాటు రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన వైసీపీని భూస్థాపితం చేస్తానని మాటిచ్చారు. అయితే, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా గ్రామాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, విలేజ్ క్లినిక్‌లపై వైఎస్సార్ పేరు కొనసాగడం బాధాకరం. ఇది స్థానిక నాయకుల లోపమా లేక సిబ్బందిలో నిర్లక్ష్యమా? ఇకపై ఈ పేరును తొలగించడమే మా లక్ష్యం" అని స్పష్టం చేశారు. క్లీనింగ్ పనులు స్వయంగా చేపడతానన్న సురేష్ నాయుడు వైఎస్సార్ పేరును వెంటనే తొలగించాలని, అవసరమైతే తానే స్వయంగా పెయింట్ డబ్బా, బ్రష్ పట్టుకొని క్లీనింగ్ చేపడతానని హెచ్చరించారు. సర్వేపల్లి నియోజకవర్గంలోని 117 పంచాయతీల్లోనూ ఇదే పని జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు గుమ్మినేని వాణి భవాని నాయుడు, స్థానికులు పెడకాల కిషోర్, మల్లికార్జున్ రావు, కృష్ణ, రామ్ తేజ్ తదితరులు పాల్గొన్నారు.


## తేలూరు తుమ్మలపల్లిలో విషాదం

- తల్లి కూతురు దారుణ హత్య
- పోలీసుల అదుపులో కుటుంబ యజమాని



**పులివెందుల, జనవరి 7 (జనస్వరం) :** నియోజకవర్గంలోని తొండూరు మండలం తేలూరు తుమ్మలపల్లి గ్రామంలో విషాదం చోటు చేసుకుంది. భార్యా బిడ్డను కుటుంబ యజమాని హతమార్చాడు. ప్రస్తుతం పోలీసులు కుటుంబ యజమానిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. ఈ విషాద సంఘటనకు సంబంధించి హతుడి బంధువుల కథనం ప్రకారం తుమ్మలపల్లిలో సాధారణ జీవితం గడుపుతున్న గంగాధర్ రెడ్డికి భార్య శ్రీలక్ష్మి, కుమార్తె గంగోత్రి ఉన్నారు. శ్రీలక్ష్మి అదే గ్రామంలోని అంగన్వాడి సెంటర్లో ఆయగా పనిచేస్తోంది. కుమార్తె గంగోత్రి సదరు మండలంలోని ఇనగలూరు గ్రామంలో9వ తరగతి చదువుతోంది బేల్దారి పనులు చేసుకుంటూ సాధారణ జీవనం సాగిస్తున్న గంగాధర్ రెడ్డి ఇటీవల మద్యం బాగా అలవాటు చేసుకున్నాడు. బేల్దారి పనులు పక్కన పెట్టి మద్యానికి బానిస అయ్యాడు. సోమవారం వారం రాత్రి భార్య శ్రీలక్ష్మిని, కుమార్తె గంగోత్రిని మచ్చు గతితో అతి కిరాతకంగా హత్య చేశాడు. హత్య చేసిన అనంతరం గంగాధర్ రెడ్డి ఇంటి వద్దనే ఉన్నాడు. కాగా గంగాధర్ రెడ్డికి మతిస్థిమితం సరిగా లేదని పలువురు వ్యాఖ్యనిస్తున్నారు. ఈ హత్య సమాచారం అందుకున్న తొండూరు పోలీస్ స్టేషన్ పోలీసులు గ్రామానికి వెళ్లి హత్యా సంఘటనను పరిశీలించారు. హత్యకు గల కారణాలపై విచారిస్తున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

## చిన్నారులందరికీ టీకాలు వేయాలి




**పులివెందుల జనవరి 7 (జనస్వరం) :** అర్హత కలిగిన చిన్నారులందరికీ టీకాలు వేయాలని డాక్టర్ రేష్మ అన్నారు. తొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం డాక్టర్ రేష్మా ఆధ్వర్యంలో ఆశాడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రేష్మ మాట్లాడుతూ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం బుధ, శనివారాలల్లో నిర్దేశించిన ప్రణాళిక ప్రకారం నిర్వహించాలన్నారు. అర్హులైన పిల్ల లందరికీ టీకాలు అందించాలని తెలిపారు. టీకాలు వేయు ప్రదేశం శుభ్రంగా ఉంచాలని, తల్లులకు టీకాలు ఏ వ్యాధులు రాకుండా వేస్తున్నమో తెలియజేయాలన్నారు. అర్హులైన అందరికీ వందశాతం టీకాలు వేయాలని తెలిపారు. కాలనుగుణ వ్యాధుల గురించి ఊపిరితిత్తుల వ్యాధుల గురించి. నివారణ చర్యలు గురించి తీసుకోవలసిన జాగ్రత్తల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఆసుపత్రి ప్రసవాలు పెంచాలని సాధారణ కాన్పులను తొండూరు ఆసుపత్రిలో చేస్తారని తెలిపారు. ఇంటింటి దర్శనాల ద్వారా అసంక్రమణ వ్యాసులైన రక్తపోటు, మధుమేహం, హిమో గ్లోబిన్, క్యాన్సర్ వ్యాదులను గుర్తించాలని తద్వారా త్వరగా చికిత్స చేయుటకు వీలవుతుందన్నారు. పై వాటి ద్వార సంభవించే మరణాలు నివారించాలని తెలిపారు. అలాగే పాఠశాల ఆరోగ్య క్రమం ప్రతి గురువారం నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ ఆరోగ్య అధికారిని విజయ, హెల్త్ ఏడ్యుకేటర్ మల్లయ్య, సూపర్వైజర్ శశికళ హెల్త్ ప్రొవైడర్స్ సోమేశ్వరీ, శిరీష, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆర్ జె పాలెం డాక్టర్ మనోజ్ఞకు ఘన వీడ్కోలు



**కొయ్యూరు, జనవరి 7 (జనస్వరం) :** స్థానిక ఆర్‌జె పాలెం హాస్పటల్లో డాక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న, డాక్టర్ మనోజ్ఞ బదిలీ గిరిజన ప్రజలకు చాలా బాధాకర విషయమని ఫీడర్ ఈఎంటీలు అన్నారు. అలాగే డాక్టర్ మనోజ్ఞ గిరిజన ప్రజలందరూ గుండెల్లో ఉంటారన్నారు. అలాగే గిరిజన ప్రజలందరికీ కంటికి రెప్పలాగా డాక్టర్ మనోజ్ఞ చూసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పిహెచ్ఎన్, హెచ్‌విలు, ఏఎన్ఎంలు, ఆశాలు, హెల్త్ అసిస్టెంట్లు, హాస్పటల్ స్టాఫ్ నర్స్ లు, హాస్పటల్ సిబ్బంది, ఎల్ టి, ఫార్మసిస్ట్, 108 సిబ్బంది, 104 సిబ్బంది, ఎం.ఎల్.హెచ్.పిలు పాల్గొన్నారు.


## గోదావరి కాలువలో గుర్రపు డెక్క తొలగింపు పనులు

- ఆఖరి రైతు వరకు సాగునీటిని అందించేలా చర్యలు తీసుకుంటాం
- డీసీ చైర్మన్ రాంబాబు,ఇరిగేషన్ ఎఈ సుబ్రహ్మణ్యం వెల్లడి



**దెందులూరు, జనవరి 7 (జనస్వరం) :** ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా రైతులకు సాగునీటి సమస్యలు లేకుండా ఆఖరి చివరి రైతు వరకు పంట పొలాలకు అందించే విధంగా చర్యలు తీసుకుంటా మని గోదావరి కాలువ (డీసీ) చైర్మన్ వెలమాటి రామచంద్ర ప్రసాద్ (రాంబాబు), ఇరిగేషన్ అసిస్టెంట్ ఇంజనీర్ సుబ్రహ్మణ్యం అన్నారు. మంగళవారం దెందులూరు మండలం గుండుగోలను సెక్షన్ కార్యాలయంలో ఇరిగేషన్ ఏఈ సుబ్రహ్మణ్యం, మల్కాపురం సాగునీటి వినియోగదారుల సంఘం డిసి చైర్మన్ వెలమాటి రామచంద్ర ప్రసాద్ (రాంబాబు) సత్యనారాయణపురం సాగునీటి వినియోగదారుల సంఘం అధ్యక్షులు పర్వతనేని రంగారావు, టిడిపి నేతలు నున్న లక్ష్మణ్ బాబు, గండి రాజా, టీడీపీ నేతలతో కలిసి మే నెల 2024లో పూళ్ల నుండి గుండుగోలను వరకు రూ 28 లక్షల రూపాయలతో గుర్రపు డెక్క తొలగింపు పనులను వారు పరిశీలించారు. రైతులకు ఇబ్బంది లేకుండా సాగునీరు చివర రైతు వరకు వెళ్లే విధంగా త్వరితగతిన కాలవలో తుక్కు, తూడు, గుర్రపు డెక్క తొలగించే పనులను పరిశీలించారు. అనంతరం సత్యనారాయణపురం దెందులూరు మల్కాపురం కాలువ వద్ద గుర్రపు డెక్కన్ కాల్వ నీటిని డిసి చైర్మన్ వెలమాటి రాంబాబు, సాగునీటి వినియోగదారు సంఘం అధ్యక్షులు పర్వతనేని రంగారావుతో కలిసి వారు పరిశీలించారు. వారి వెంట టిడిపి నేత కసుకుర్తి రామకృష్ణ, సాగునీటి వినియోగదారు సంఘం అధ్యక్షులు ఉన్నారు.

## సీఎస్ విజయ నంద్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి



**విజయవాడ, జనవరి 7 (జనస్వరం) :** స్థానిక ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఛాంబర్‌లో పుట్టపర్తి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మంగళవారం విజయా నంద్‌ను కలిసి పుష్ప అందించి మర్యాదపూర్వకంగా కలిసి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో అగ్రభాగాన నిలవాలని కోరుకుంటు న్నట్లు తెలిపారు. వెనుకబడిన ఉమ్మడి అనంతపురం జిల్లా అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తగిన సహాయ సహకారాలు అందిస్తున్నారని, మీరు మీ తోపాటు అధికార యంత్రాంగం అదే స్ఫూర్తితో రాష్ట్ర అభివృద్ధికి, ఉమ్మడి అనంతపురం జిల్లా సమగ్ర అభివృద్ధికి తగిన తోడ్పాటు నివ్వాలని కోరారు.

## జెమినీ ప్రసాద్ మృతి అత్యంత బాధాకరం

- సీనియర్ జర్నలిస్ట్ ప్రసాద్ పై మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తీవ్ర దిగ్ర్భాంతి
- పాత్రికేయ వృత్తిలో నీతి నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం : దేవ ప్రసాద్



**పుట్టపర్తి, జనవరి 7 (జనస్వరం) :** సీనియర్ పాత్రికేయుడు జెమిని ప్రసాద్ మృతిపై మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి,పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి తీవ్ర దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. దేవప్రసాద్ తీవ్ర అనారోగ్యంతో సోమవారం సాయంత్రం మృతి చెందిన సంఘటన తెలుసుకున్న మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి విజయవాడ నుంచి ఆయన పోన్ ద్వారా తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు 30 సంవత్సరాలుగా మీడియా ప్రతినిధిగా ఉంటూ అనేక సేవలు అందిం చిన ప్రసాద్ గురించి ఎంత చెప్పిన తక్కువే అవుతుందని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డిలు అభిప్రాయపడ్డారు. సిటీ కేబుల్ నుంచి తన ప్రస్థానాన్ని ప్రారంభించి సుదీర్ఘకాలం పాటు మీడియా రంగంలో పనిచేసిన ఆయన సేవలు వెలకట్ట లేనవన్నారు. ఏ రోజు స్వార్థ ప్రయోజనాల కోసం ఆయన పని చేయలేదన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని భగ వంతున్ని ప్రార్థిస్తున్నట్లు మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తెలిపారు.

# హెచ్ఎంపీవీ వైరస్ పట్ల జిల్లా ప్రజలు ఆందోళన చెందవద్దు

**- జిల్లాలో కొత్త వైరస్ కేసులు ఎలాంటివి నమోదు కాలేదు**

**- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి**



**నంద్యాల, జనవరి 7 (జనస్వరం) :** హెచ్ఎంపీవీ వైరస్ పట్ల ప్రజల్లో భయాందోళనకు చెందవద్దని, రాష్ట్రంలో ఇంకా ఎటువంటి కేసులు ఇప్పటిదాకా నమోదు కాలేదని ప్రజారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి అన్ని జిల్లాల వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు తెలిపారు. ఈ సందర్భంగా నంద్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాగిరి వెంకట రమణ మాట్లాడుతూ హెచ్ఎంపీవీ వైరస్ కేసులు జిల్లాలో ఇప్పటిదాకా ఎలాంటివి నమోదు కాలేదన్నారు. జిల్లా ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవ ద్దన్నారు. ఈ వైరస్ చిన్నారులకు 70 సంవత్సరాలు వృద్ధులకు ఇమ్యూనిటీ పవర్ తగ్గిన వారికి మాత్రమే ఈ వైరస్ సోకే ప్రమా దం ఉందన్నారు. హెచ్ఎంపీవీ వైరస్ సోకిన తర్వాత వ్యాధి లక్ష ణాలు 3 నుంచి 10 రోజుల్లోగా బయటపడుతాయని తెలిపారు. హెచ్ఎంపీవీ సోకిన వారికి సాధారణ జలుబు (ఫ్లూ) లాంటి లక్ష ణాలు ఉంటాయన్నారు. దగ్గు, ముక్కు దిబ్బెడ, ముక్కు కారడం, గొంతు నొప్పి, శ్వాస సంబంధిత సమస్యలు కూడా కన్పిస్తాయని తెలిపారు. చైనాలో గుర్తించిన మరో కొత్త వైరస్ హెచ్ఎంపీవీ (హ్యూమన్ మెటా న్యూమో వైరస్)కి సంబంధించిన కేసులు జిల్లాలో మే 29 మండలాలలో ఎక్కడా లేవని చెప్పారు. ఈ వైరస్ కారణంగా ప్రజలు ఎవరూ భయాందోళనలు చెందాల్సిన అవస రం లేదని తెలిపారు. న్యూమో విరిలే కుటుంబానికి చెందిన ఈ వైరస్ కరోనా వైరస్ తరహాలోనే ఒకరి నుంచి మరొకరికి సంక్రమిస్తుందన్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు, వ్యాధి నిరోధకశక్తి తక్కువగా ఉన్న వారిపై ఈ వైరస్ ప్రభావం ఎక్కువగా ఉంటుందన్నారు. వైరస్ సోకిన వారి దగ్గు, తుమ్ముల వల్ల వెలువడే తుంపర్ల ద్వారా, వారితో సన్నిహితంగా మెలగటం, కరచాలనం, స్పర్శ వంటి చర్యల ద్వారా ఈ వైరస్ వ్యాపిస్తుందని చెప్పారు. వైరస్ ఉన్నట్లయితే, తాకిన తర్వాత అదే చేతితో నోరు, ముక్కు, కళ్లను తాకటం ద్వారా మన శరీరంలోకి ఈ వైరస్ వ్యాపిస్తుందన్నారు. వైరస్ సోకిన తర్వాత వ్యాధి లక్షణాలు 3 నుంచి 10 రోజుల్లోగా బయటపడను న్నాయన్నారు. హెచ్ఎంపీవీ సోకిన వారికి సాధారణ జలుబు (ఫ్లూ) లాంటి లక్షణాలు ఉంటాయని చెప్పారు దగ్గు, ముక్కు దిబ్బెడ, ముక్కు కారడం, గొంతు నొప్పి, శ్వాస సంబంధిత సమస్యలు కూడా కన్పిస్తాయని తెలిపారు. వైరస్ వ్యాప్తిని నిరోధించడానికి కోవిడ్ సమయంలో పాటించిన తరహాలోనే జాగ్రత్తలు పాటించాలని సూచించారు. 20 సెకన్లపాటు సబ్బు నీటితో తరచూ చేతులను శుభ్రంగా కడుక్కోవడం, దగ్గినపుడు, తుమ్మినపుడు, నోటిని, ముక్కును చేతిరుమాలు అడ్డు పెట్టుకోవాలన్నారు. రద్దీగా ఉండే ప్రదేశాలకు దూరంగా ఉండటం, వాడిన వస్తువులను ఇతరులతో పంచుకోకుండా ఉండటం వంటి చర్యలతో పాటు తగినంత పౌష్టికాహారం, మంచినీరు తీసుకోవాలి, తగినంత నిద్ర పోవాలని సూచించారు. వైరస్ లక్షణాలు కన్పించిన వారు క్వారంటైన్‌లో ఉండటం మంచిదన్నారు. వైరస్ సోకిన వ్యక్తులు లేదా లక్షణాలు కన్పిస్తున్న వ్యక్తులు ఇతరులతో కరచాలనం చేయరాదని, ఉపయోగించిన టవల్స్, రుమాళ్ల వంటి వాటిని మళ్లీ వాడరాదని, చేతులతో తరచూ కళ్లు, ముక్కు, నోటిని తాకరాదని, బహిరంగ ప్రదేశాల్లో ఉమ్మివేయరాదని సూచించారు. అదే విధంగా వైరస్ లక్షణాలున్న వ్యక్తులకు సమీపంగా ఇతరులు ఉండకూడదన్నారు. వైరస్ సోకినట్లు అనుమానం ఉన్న వారు వైద్యుల సలహా మేరకు మందులు వాడాలని సూచించారు. ఇప్పటి వరకూ హెచ్ఎంపీవీకి నిర్దిష్టమైన యాంటీ వైరల్ చికిత్స అనేది లేదని తేల్చిచెప్పారు. వ్యాక్సిన్లు కూడా అభివృద్ధి చేయలేదన్నారు. ఆరోగ్య సంరక్షణ కోసం నొప్పి నివారణ మందులు, ఆక్సిజన్ తెరపీ వంటివి ఇవ్వటం జరుగుతుందని స్పష్టం చేశారు. వైరస్ తీవ్రతకు ఎక్కువగా గురయ్యే చిన్న పిల్లలు, వృద్ధులకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో తగిన చికిత్స అందిస్తారని తెలిపారు. కేంద్ర వైద్య ఆరోగ్య మంత్రిత్వ శాఖ దీని బారిన పడకుండా ఉండటానికి పలు సూచనలు ఇచ్చింది. దగ్గు, తుమ్ముతున్నప్పుడు నోటికి లేదా ముక్కుకు హ్యాండ్ కర్చీఫ్ లేదా టిష్యూ పేపర్‌ను అడ్డు పెట్టుకోవాలన్నారు. సబ్బు లేదా అల్కహాల్‌తో కూడిన శానిటైజర్‌తో తరచూ చేతులను శుభ్రపర్చుకోవాలన్నారు. గుంపుగా ఉండే ప్రదేశాలకు వెళ్లకూడదన్నారు. అలాంటి ప్రదేశాలకు వెళ్లాల్సి వస్తే జాగ్రత్తలు తీసుకోవాలి. ఫ్లూతో బాధపడుతున్న వారికి దూరంగా ఉండాలని తెలిపారు. చాలినంత మంచినీళ్లు తీసుకోవాలన్నారు. పౌష్టికాహారాన్ని స్వీకరించాలన్నారు. అనారోగ్యం బారిన పడినప్పుడు ఇతరులను కలుసుకోవడాన్ని తగ్గించాలి. ఇంట్లోనే ఉండాలన్నారు. గాలి ధారాళంగా వచ్చేలా చేసుకోవాలన్నారు. ఇతరులకు షేక్ హ్యాండ్స్ ఇవ్వకూడదన్నారు. ఒకసారి వినియోగించిన టిష్యూ పేపర్లు, హ్యాండ్ కర్చీఫ్‌ను మళ్లీ వాడకూడదన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారితో దూరంగా ఉండాలన్నారు. తరచూ కంటిని నలుపుకోవడం, ముక్కు, నోటిని చేత్తో తుడుచుకోవడాన్ని మానుకోవాలన్నారు. ఈ సూచనలు పాటించి ప్రజల ఆరోగ్యంగా ఉండాలని తెలిపారు.

# ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఆకస్మిక తనిఖీ

**- మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యతా ప్రమాణాలు పాటించండి**

**- విద్యార్థినులతో కలసి సహపంక్తి భోజనం**

**- స్థానిక ప్రజా ప్రతినిధులు సమీప పాఠశాలలు పర్వేక్షించాలి**

**- ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**





**నెల్లూరు, జనవరి 7 (జనస్వరం) :** ప్రభుత్వ పాఠశాలలో వడ్డించే మధ్యాహ్న భోజనం అమ్మ చేతి వంటను తలపించేలా ఉండాలని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. కోవూరులోని జెట్టి బల రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు వడ్డించడానికి సిద్ధంగా వున్న మధ్యాహ్న భోజన నాణ్యతను ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి పరిశీలించారు. విద్యార్థులకు ఆవిడే స్వహస్తాలతో భోజనం వడ్డించారు. విద్యార్థినులతో కలిసి భోంచేసారు. శుచి, శుభ్రత పాటించాలని ఆమె మధ్యాహ్న భోజన పథక నిర్వాహకులను కోరారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ప్రోత్సాహకరంగా ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యత విషయంలో రాజీ పడితే సహించేది లేదని హెచ్చరించారు. గ్రామీణ విద్యార్థులకు ప్రయోజనం చేకూరేలా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేసిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కి ధన్యవాదాలు తెలియజేశారు. మధ్యాహ్న భోజనానికి సంబంధించి విద్యార్థుల నుంచి కానీ వారి తల్లిదండ్రుల నుంచి కానీ ఫిర్యాదుల రాకుండా చూసుకోవాల్సిన మీదేనని పాఠశాల సిబ్బందిని ఆదేశించారు. స్థానిక ప్రజా ప్రతినిధులు అప్పుడప్పుడైనా పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పర్యవేక్షించాలని కోరారు. ఆకస్మిక తనిఖీ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డితో పెన్నా డెల్టా చైర్మన్ జెట్టి రాజగోపాల్ రెడ్డి, బెజవాడ వంశీకృష్ణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని రైతులందరూ ఉపయోగించుకోవాలి




**యలమంచిలి/రాంబిల్లి, జనవరి 7 (జనస్వరం) :** రాంబిల్లి మండలం మూలజంప గ్రామంలో మంగళవారం మండల అగ్రికల్చరల్ ఆఫీసర్ వారి ఆధ్వర్యంలో "పొలం పిలుస్తుంది" అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ వైస్ ప్రెసిడెంట్ అందుకూరి ప్రసాద్, గ్రామ సర్పంచ్ వేగి అచ్చయ్య నాయుడు పాల్గొన్నారు. మండల వ్యవసాయ అధికారిణీ సుమంతా మాట్లాడుతూ "పొలం పిలుస్తుంది" కార్యక్రమాన్ని రైతులందరూ ఉపయోగించుకొని, మీకు వ్యవసాయంలో ఏర్పడే సమస్యలను మా దృష్టికి తీసుకువస్తే దానికి మీ మా వంతు తగిన సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు, పంట మార్పిడి చిరుధాన్యాలను పండించడం ద్వారా పంట దిగుబడి ఎక్కువగా తీసుకురావచ్చని రైతులకు గ్రహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఏవో సరోజిని, నాలుగో వార్డ్ మెంబెర్ వానపల్లి ముకుందేశ్వరరావు, కోరుబిల్లి సత్తిబాబు, వేగి అప్పారావు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# ఆటో అండ్ మోటార్ కార్మికుల సమస్యల పరిష్కరించాలి




**యలమంచిలి, జనవరి 7 (జనస్వరం) :** ఆటో అండ్ మోటార్ కార్మికుల సమస్యల పరిష్కరించాలని రాష్ట్ర ఆటో అండ్ మోటార్ యూనియన్ ఏఐటీయూసీ ఉపాధ్యక్షులు ఎస్కే రెహమాన్ అన్నారు. మంగళవారం యలమంచిలి పెంజెరువు దుర్గమ్మ గుడి వద్ద వద్ద జరిగిన జిల్లా స్థాయి సదస్సులో రెహమాన్ మాట్లాడుతూ ఎలమంచిలి ప్రాంతంలో బేరాలు లేక వచ్చిన స్వల్పాదయంతో బతుకు జీవనం సాధించలేక కుటుంబాలతో అనేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్న తరుణ్‌లో మూలిగే నక్కపై తాటి పండు పడ్డసందనంగా జీఓ నెంబర్ 21, 31లను తీసుకొచ్చి వేలాది రూపాయల అపరాధ రుసుములు ఆర్టిఏ పోలీసుల ద్వారా కేసులు పెడుతూ వసూలు చేస్తున్నారు. మోటార్ కార్మికులకు భద్రతతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ఈ అవగాహన సదస్సుకు అతిథులుగా హాజరైన పట్టణ రూరల్ ఎస్సైలు కే.సావిత్రి, ఎం ఉపేంద్రలు మాట్లాడుతూ విధి నిర్వహణలో డ్రైవర్లంతా అప్రమత్తంగా ఉండాలని, ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేరవేసి ప్రమాదాలు గురు కాకుండా జాగ్రత్తలు తీసుకొని పాటించాలన్నారు. అనంతరం పట్టణంలో ఆటో మోటార్ కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి గని శెట్టి ఏసుదాసు పట్టణ, రూరల్ ఆటో యూనియన్ అధ్యక్షులు అల్లిమల్ల నాగు కొటార్ తాతాజీ బంగారప్పలనాయుడు లక్ష్మీ బాబు ఎన్ శివ భాష విశ్వనాథం వివిధ ఆటో యూనియన్ అధ్యక్షులు నాయకులు కార్మికులు అధిక సంఖ్యలో సుమారు 400 మంది వరకు సదస్సు హాజరయ్యారు.

# సీఐటీయూ మాజీ జిల్లా నాయకులు కామ్రేడ్ ఎ.బాలకృష్ణకు నివాళి



**యలమంచిలి, జనవరి 7 (జనస్వరం) :** మండలంలోని రేగుపాలెం పీహెచ్‌సీ ఆవరణలో సీఐటీయూ మాజీ జిల్లా నాయకులు కామ్రేడ్ ఎ. బాలకృష్ణ ప్రదమ వర్ధంతి సందర్భంగా అయన చిత్రపటానికి సీఐటీయూ మండల కార్యదర్శి సిహెచ్ శివాజీ, రేగుపాలెం పీహెచ్‌సీ ఆశవర్కర్లు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి సీహెచ్ శివాజీ మాట్లాడుతూ కామ్రేడ్ బాలకృష్ణ నిరంతరం ప్రజా సమస్యలపై పనిచేసారని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు కరణకు వ్యేతిరేక పోరాటాలు నిర్వహించారని, ఈ జిల్లాలో ఉన్న ఏటికొప్పాక, తుంపాల, తాండవ షుగర్ ఫ్యాక్టరీలు తెరవాలని పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహించారని, కార్మికులు రైతులు ప్రజా సమస్యలపై నిత్యం ఉద్యమాలు నిర్వహించారని, ఆయన స్మరించుకోవడం అంటే ప్రజా ఉద్యమాలను బలపరచడమేనని కొనియాడారు. రేగుపాలెం పీహెచ్‌సీ ఆశ సంఘం కార్యదర్శి లక్ష్మి, ఆశలు కనకకుమారి, వరలక్ష్మి, బేబీ రాణి, కుమారి, సత్యవతి, రమణకుమారి, రత్నవేణి, పాల్గొన్నారు.

# ఆత్మీయ సమావేశానికి వేలాదిగా తరలి రండి

**జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి తురక వెంకటేశ్వర్లు**



**సీతారాంపురం, జనవరి 7 (జనస్వరం) :** బుధవారం ఉదయం 9 గంటలకు వింజమూరులోని ఎస్వి కన్వెన్షన్ హాలులో ఉదయగిరి నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులకు, కార్యకర్తల కు, అభిమానులకు ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి తురక వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ ఆత్మీయ సమావేశానికి మన ప్రియతమ నాయకులు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఉదయగిరి నియోజ కవర్గ ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పాల్గొంటున్న సందర్భంగా నియోజకవర్గంలోని కూటమి నాయకులు కార్యకర్తలు వేలాదిగా పాల్గొని ఆత్మీయ సమావేశాన్ని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

# శరవేగంగా జరుగుతున్న ఎంపీ, ఎమ్మెల్యే ఆత్మీయ సమావేశ పనులు

**ఆత్మీయ సమావేశ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే కాకర్ల**



**ఉదయగిరి, జనవరి 7 (జనస్వరం) :** వింజమూరు మండల కేంద్రంలోని ఎస్వీ కన్వెన్షన్ హాల్‌లో స్థానిక పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆత్మీయ సమావేశ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ పనులను ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దగ్గరుండి పరిశీలించి నియోజకవర్గ వ్యాప్తంగా విచ్చేయుచున్న కూటమి నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పనులను పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు.

# బాల్య వివాహాలపై అవగాహన సదస్సు



**సీలేరు, జనవరి 7 (జనస్వరం) :** సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీలేరు మహిళా పోలీస్ రేవతి బాల్య వివాహాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళా పోలీస్ రేవతి మాట్లాడుతూ చిన్న వయసులో పెళ్లి చేసుకోవడం వల్ల పుట్టే పిల్లలు అనారోగ్యంతో పుట్టడమే కాక ప్రసవ సమయంలో తల్లి బిడ్డ మరణించే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. తక్కువ వయసులో పెళ్లిళ్లు చేసుకోవద్దని బలవంతంగా మీ తల్లిదండ్రులు పెళ్లికి సిద్ధపడితే మీ అధ్యాపకులకు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని, విద్యార్థులకు బాల్య వివాహాలపై తగు సలహాలు సూచనలు ఇచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్ వి.శంకర్రావు విద్యార్థులతో మాట్లాడుతూ చిన్న వయసులో పెళ్లిళ్లు వద్దు కెరియర్ ముద్దు అందరూ ఉన్నత విద్య చదువుకొని సెటిల్ అయ్యాక పెళ్లి చేసుకోవాలని, లేదంటే చిన్న వయసులోనే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని విద్యార్థులకు హితబోధ చేశారు. ఈ కార్యక్రమంలో సిలేరు మహిళా పోలీస్ రేవతి, కళాశాల ప్రిన్సిపాల్ వి శంకర్రావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డి శ్రీను, కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

# విజ్ఞాన్ పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు



**కైకలూరు జనవరి 7 (జనస్వ రం) :** పట్టణంలోని ఏలూరు రోడ్డులో గల విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో మంగళవారం పాఠశాల ప్రిన్సిపాల్ జి. నాగలక్ష్మి ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు హరిదాసు, గంగిరె ద్దుల వేషధారణ, తెలుగింటి ఆడపిల్లల వస్త్రధారణ, పల్లెటూరి జానపద నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, భోగి మంటలు, ముగ్గుల పోటీలు వంటి వినోద కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విజ్ఞాన్ విద్యాసంస్థల అధినేత జిపి రంగారావు ముఖ్యఅతిథిగా హాజరై సంక్రాంతి పండుగ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థుల పాల్గొన్నారు.

# గాయపడిన వ్యక్తికి ఆర్థిక సాయం



**శంఖవరం, జనవరి 7 (జనస్వరం) :** తన అనుకున్న వారు ఆపదలో ఉన్నారని తెలిస్తే నిస్వార్థంగా సాయం చేయాలనే సంకల్పంతో ప్రత్తిపాడు నియోజకవర్గ వైసీపీ నేత, ఎంఎంఆర్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు ముందుకెళుతున్నారు. మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన కోట్నాల మధు ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడ్డారు. మంగళవారం ముదునూరి పరామర్శించి ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంలో గాయపడి ఇంటి వద్దనే ఉంటున్న మధుకి ముదునూరి రూ.5000లు ఆర్థిక సాయం అందించి మరోసారి మానవత్వం చాటుకున్నారు. ముదునూరి మాట్లాడుతూ నియోజకవర్గంలోని పేదలకు, కార్యకర్తలకు, నా అభిమానలకు ఎవరికి కష్టం వచ్చినా అండగా నిలుస్తానని, ట్రస్ట్ ద్వారా తన వంతు సాయం అందించి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాని, చంటి, కోలా తాతబాబు, జువ్వల దొరబాబు, బొల్లు నాగేశ్వరరావు, శ్రీను, ఏసు, రాజేష్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంలో మట్టి రోడ్లకు సీసీ సొబగులు : పర్వత సురేష్





**శంఖవరం, జనవరి 7 (జనస్వరం) :** గ్రామాల్లో సరైన రహదారులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే పల్లెల్లోని మట్టి రోడ్ల రూపురేఖలు మారుతున్నాయని, మట్టి దారులను సీసీ రహదారులుగా మార్చేందుకు నిధులు మంజూరు అవుతున్నాయని ప్రత్తిపాడు నియోజకవర్గ టీడీపీ సీనియర్ నేత పర్వత సురేష్ అన్నారు. సురేష్ మాట్లాడుతూ శంఖవరంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నుంచి మంజూరైన నిధులతో ఏడు చోట్ల సుమారు 23 లక్షలతో సీసీ రోడ్లు వేసినట్లు తెలిపారు. మార్కెట్, స్మశానం వద్ద సీసీ రోడ్లు వేయడంతో గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యంతో రోడ్లు గోతులతో ప్రయాణానికి వీలు లేకుండా పోయిందని, టీడీపీ ప్రభుత్వం రోడ్లపై దృష్టి సారించిందని, ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ కృషితో గ్రామంలో మరిన్ని రోడ్లకు త్వరలో పనులు చేపడతామని సురేష్ అన్నారు.


# నల్లమాడ మేజర్ పంచాయతీ కార్మికులకు దుప్పట్లు పంపిణీ




**నల్లమాడ, జనవరి 7 (జనస్వరం) :** స్థానిక మేజర్ పంచాయతీ కార్మికులకు టీడీపీ జిల్లా అధ్యక్షుడు సామకోటి ఆదినారాయణ టీడీపీ నాయకులు కార్యకర్తలు కలిసి కార్మికులకు మంగళవారం దుప్పట్లను అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పలువురు మాట్లాడుతూ పంచాయతీ కార్మికులు కరోనా కష్టకాలంలో వారి ప్రాణాలను సైతం లెక్కచేయకుండా రహదారులను శుభ్రం చేసి ప్రజలం దరి ఆరోగ్యాలను కాపాడినటువంటి పంచాయతీ కార్మికులు వారి కుటుంబ సభ్యులను ప్రత్యేకంగా అభినందించి, వారు చేసిన సేవలను మనం గుర్తించాల్సిన అవసరం ఉందని తెలియజేశారు. నల్ల మాడ పంచాయతీ కార్మికులకు నల్లమాడ సచివాలయం దగ్గర దుప్పట్లను పంపిణీ చేసి వారి చేసిన సేవలు వెలకట్టలేనని, కరోనా సమయంలో ఎవరు బయటకి రాలేని పరిస్థితుల్లో కూడా వీరు సేవలు అమోఘమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ విశ్వనాథ రెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ మైలే శంకర్, డాక్టర్ బుట్టి నాగభూషణం నాయుడు, కొండ్రెడ్డి బయారెడ్డి, ఆర్ నితిన్ కుమార్, పాల అంజనమ్మ, ఎస్ కేశవరెడ్డి, పల్లపు ప్రతాప్, ఎం రవి కుమార్, డ్రైవర్ ఎం నరసింహులు, ఏ మురళి, వి మహేంద్ర నాయక్, మాజీ డీలర్ రామప్ప, డైరెక్టర్ ఎన్ నరసింహులు, వలం కృష్ణయ్య, అగ్గి రాముడు తదితరులు పాల్గొన్నారు.

# రెడ్ క్రాస్ చైర్మన్ పదవికి ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి రాజీనామా

**నెల్లూరు, జనవరి 7 (జనస్వరం) :** నెల్లూరు రెడ్ క్రాస్‌పై మంత్రి నారాయణ చేస్తున్న కుట్రలతో రెడ్ క్రాస్ సంస్థ ప్రతిష్ట దెబ్బ తిన కూడదు అన్న ఆలోచనతో రెడ్ క్రాస్ చైర్మన్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి స్పష్టం చేశారు. నెల్లూరు రెడ్ క్రాస్ చైర్మన్ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మీడియా సమావేశం నిర్వహించి సంచలన విషయాలను వెల్లడించారు. గత నాలుగేళ్లగా నెల్లూరు రెడ్ క్రాస్ ద్వారా పేద ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నామని రెడ్ క్రాస్ చైర్మన్ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా నెల్లూరు రెడ్ క్రాస్ 13 ప్రాజెక్టులతో ప్రజలకు విశేష సేవలందిస్తుందని తెలిపారు. రెడ్ క్రాస్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి.. రెడ్ క్రాస్ కమిటీ ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేశామని తెలిపారు. కరోనా లాంటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా రెడ్ క్రాస్ ద్వారా ముందుకొచ్చి ప్రజలకు ఎన్నో సేవలు చేయడం జరిగిందన్నారు. రెడ్ క్రాస్ కమిటీ ద్వారా క్యాన్సర్ హాస్పిటల్ అభివృద్ధి, బ్లడ్ బ్యాంక్ ఆధునీకరణ, తల సేమియా క్లినిక్ ఏర్పాటు, రెడ్ క్రాస్ స్పాస్టిక్ సెంటర్లో మానసిక దివ్యాంగులైన చిన్నారులకు ఉచిత బస్సు, ఉచిత భోజన వసతి ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రస్తుతం మంత్రి నారాయణ రెడ్ క్రాస్ ప్రతిష్టను దెబ్బతీసేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. అందుకు ప్రత్యక్ష ఉదాహరణ తానేనని పేర్కొన్నారు. నారాయణ




హాస్పిటల్ వారికి అనుమతులు లేనప్పటికీ రెడ్ క్రాస్ ద్వారా ఒప్పందం కుదుర్చుకోని క్యాన్సర్ వైద్యశాల ఏర్పాటు చేయాలని భావించి తనను సంప్రదించారని తెలిపారు. నారాయణ హాస్పిటల్ వారికి క్యాన్సర్ హాస్పిటల్‌కు ఆరోగ్యశ్రీ అనుమతులు సంవత్సరం వరకు వచ్చే అవకాశం లేదని తెలిపారు. అందుచేత రెడ్ క్రాస్ ద్వారా ఒప్పందం కుదుర్చుకొని క్యాన్సర్ చికిత్స అందిస్తున్నట్లు చూపి ఆరోగ్యశ్రీ కోసం నారాయణ హాస్పిటల్ వారు సిద్ధపడ్డారని ఆరోపించారు. ఆపై కుట్రలు చేసి నన్ను రెడ్ క్రాస్ చైర్మన్ పదవి నుంచి తొలగించాలని మంత్రి నారాయణ రాష్ట్ర కమిటీ నుంచి ఆగ మేఘాల మీద ఆర్డర్స్ తీసుకువచ్చారని తెలిపారు. అయితే వారు తీసుకొచ్చిన ఆర్డర్స్ రెడ్ క్రాస్‌లో ఎక్కడ చెల్లుబాటు కావని పేర్కొన్నారు. ఈ విషయంపై నిన్నటి రోజున కలెక్టర్ గారిని కలిసి రెడ్ క్రాస్ లో కొన్ని పనులు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని పూర్తి చేసి జనవరి నెల చివరి నాటికి తానే స్వచ్ఛందంగా రెడ్ క్రాస్ చైర్మన్ పదవికి రాజీనామా చేస్తానని తెలియజేశానని చెప్పారు. అలాగేనని ఒప్పుకున్న కలెక్టర్ మంగళవారం సాయంత్రం మేనేజ్మెంట్ కమిటీతో సమావేశం నిర్వహించారన్నారు.

**నా వల్ల రెడ్ క్రాస్ కు ఎలాంటి ఇబ్బంది రాకూడదు :**
రెడ్ క్రాస్ ద్వారా పేద ప్రజలకు అందుతున్న సేవలు ఎక్కడ నిలిచి పోకూడదన్న ఉద్దేశంతో తాను రెడ్ క్రాస్ చైర్మన్ పదవికి స్వచ్ఛందంగా రాజీనామా చేస్తూ నిర్ణయం తీసుకున్నానని తెలిపారు. రాజీనామా పత్రాన్ని మేనేజ్మెంట్ కమిటీకి అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. తాను రాజీనామా చేసినప్పటికీ.. రెడ్ క్రాస్‌కు పూర్తి సహాయ సహకారాలు అందిస్తూ.. రెడ్ క్రాస్ అభివృద్ధికి పాటుపడతానని తెలిపారు.

## ముగిసిన సాంప్రదాయ క్రీడలు

**బహుమతులు అందించిన జ్యోతుల మణి**



**జగ్గంపేట, జనవరి 7 (జనస్వరం) :** స్థానిక సర్కిల్ పరిధిలో పోలీసు శాఖ చే నిర్వహించిన గ్రామీణ సాంప్రదాయ క్రీడలు మంగళవారం ముగిసాయి. స్థానిక ప్రభుత్వ మోడల్ డిగ్రీ ఆవరణంలో రంగు, రంగుల రంగవల్లులతో సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. భోగి మంటలు వేసి సంక్రాంతి సంబరాలు జరిపారు. ఈ నెల 2న ప్రారంభమైన వాలీబాల్, కబడ్డీ పోటీలు హోరాహోరీగా సాగాయి. ఆఖరిరోజు ఫైనల్ బాలికల కబడ్డీ పోటీల్లో జగ్గంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు గెలుపొందారు. అలాగే సీనియర్ వాలీబాల్‌లో మండలంలోని ఇర్రిపాక టీమ్ ప్రథమ స్థానం సాధించింది. వీరికి ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సతీమణి మణి, జనసేన పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇంచార్జి, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు, ఐసీడీఎస్ సిడిపిఓ పూర్ణిమ తదితరులు అందజేశారు. ఈ సాంప్రదాయ క్రీడల్లో భాగంగా మహిళలకు ముగ్గులు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను వారు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అత్తులూరి నాగబాబు, టీడీపీ నాయకులు ఎస్‌విఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, జగ్గంపేట, గండేపల్లి, ఎస్ఐలు రఘునాథరావు, యు.వి శివ నాగబాబు, తదితరులు పాల్గొన్నారు.

## కడుపునొప్పి భరించలేక బలవన్ మరణం

**తనకల్లు, జనవరి 7 (జనస్వరం) :** మండలంలోని రాజు వారి పల్లికి చెందిన బోయ వెంకటేష్ (43) కొద్దిరోజులుగా కడుపు నొప్పితో బాధపడుతూ మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. దీనిని గమనించిన స్థానికులు స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. ఎస్సై గోపి వివరాల



ప్రకారం చేపల వ్యాపారం చేసుకుంటూ వెంకటేష్ తండ్రితో కలిసి జీవనం సాగించేవారు. కొంతకాలం నుండి వెంకటేష్ కడుపు నొప్పితో ఇబ్బంది గురవుతున్నాడు. చాలాచోట్ల వెంకటేష్‌కి వైద్యం చేయించినప్పటికీ సాధ్యం కాక మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. చనిపోయిన విషయం తెలుసుకున్న బంధుమిత్రులు మృతుడిని చూడడానికి ఆసుపత్రికి చేరుకున్న సమయంలో మృతుడి భార్య తల్లిరోధనలతో ఆసుపత్రిలో విషాదఛాయలు అలుముకున్నాయి. తండ్రిని కోల్పోయిన చిన్నారుల పరిస్థితి చూసిన వారంతా చలించిపోయారు. ఎవరైనా దాతలు ఉంటే వీరికి ఆర్థిక సాయం చేయాలని భార్యా పిల్లలు తల్లిదండ్రులు వేడుకున్నారు.

## పెన్ పవర్ క్యాలెండర్ ఆవిష్కరణ




**విఆర్ పురం, జనవరి 7 (జనస్వరం) :** ఎస్.ఐ.సంతోష్ కుమార్ మంగళవారం పెన్ పవర్ క్యాలెండర్‌ను ఆవిష్కరణ చేశారు. పెన్ పవర్ దినపత్రిక 2025 క్యాలెండర్‌ను ప్రెస్ క్లబ్ సభ్యులు సమక్షంలో ఎస్ఐ సంతోష్,కుమార్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్.ఐ.సంతోష్ కుమార్ మాట్లాడుతూ నిజాయితీ, ప్రజాపక్షంగా పోరాట స్ఫూర్తితో వార్తలు వ్రాయడమే పత్రికల మనుగడకు ఆధారమన్నారు. ప్రభుత్వాలకు అధికారులకు ప్రజలకు మధ్య వారధిగా పత్రికలు పనిచేయాలన్నారు. సోషల్ మీడియా ప్రభావం వల్ల క్షణకాలంలో సమాచారం లోకమంతా ప్రచారం అయిపోతుందని జర్నలిస్టులు సమన్వయంతో సమన్యాయంతో సమాజానికి మేలు కలిగే విధంగా వార్తలు ప్రచురించాలని, కలం తన గళం విప్పితే అవినీతి పరులకు నిద్ర పట్టదని,సమాజం కోసం పత్రికలు పని చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో వివేకానంద క్లబ్ అధ్యక్షులు దన్నాన రామారావు,గౌరవ అధ్యక్షులు యం.సత్తిబాబు కె.కృపారావు, ఎన్ నాగేంద్రబాబు, సాయి తదితరులు పాల్గొన్నారు.

## తక్షణమే ప్రాధాన్యత ఇచ్చిన గ్రామాలకు ప్యాకేజీ ఇప్పించండి



**కూనవరం, జనవరి 7 (జనస్వరం) :** ప్రతి సంవత్సరం మునుగుతూ ఇబ్బంది పడుతున్న ముంపు గ్రామాలలో కొన్నింటిని గుర్తించడం జరిగిందని వాటికి వెంటనే ప్యాకేజీ ఇవ్వాలన్నారు. ఈ మేరకు చింతూరు ఐటీడీఏ కార్యాలయంలో మండల ప్రజా ప్రతినిధులు ఆర్ అండ్ ఆర్ అధికారిని కలిసి మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా ప్యాకేజీ ఇచ్చి నిర్వాసితులకు న్యాయం చేయాలన్నారు. ప్రతి నిర్వాసితుడికి 10 లక్షలు నష్ట పరిహారం అందించాలన్నారు. అలాగే బొజ్జరాయి గూడెంలో పెండింగ్‌లో 13 కుటుంబాలకు ప్యాకేజీ చెల్లించా లన్నారు. భూమికి భూమి ఇవ్వాలన్నారు. అనంతరం ఏపీఓని కలిసి స్థానిక సమస్యలు, రోడ్లు, సమ స్యలపై వినతిపత్రం అందజేశారు. పాంశాల భవనాల మరమ్మతుల గురించి వివరించారు. సానుకూ లంగా స్పందించి సమస్యలు పరిష్కారం అయ్యేల చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య, జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరావు, పాయం సీతారా మయ్య, సర్పంచ్ నాగమణి, వెంకమ్మ, శంకర్, ఎంపీటీసీలు అమ్మాజి, జయసుధ, తమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే ఆస్తులు వెనక్కే

**- పిల్లల హక్కులు రద్దు చేసే అధికారం ఆర్డీవోకి**

**- ఆదేశాలు జారీ చేసిన రిజిస్ట్రేషన్ల శాఖ**



**అమరావతి, జనవరి 7 (జనస్వరం) :** వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల సంక్షేమాన్ని పట్టించుకోకుండా వారిచ్చిన ఆస్తులను మాత్రం అనుభవిస్తున్న వారికి ప్రభుత్వం పెద్ద ఝలక్ ఇచ్చింది. తల్లిదండ్రులను పట్టించుకోని పక్షంలో వారిచ్చిన ఆస్తులపై పిల్లల హక్కులను రద్దు చేసి తిరిగి తల్లిదండ్రులకు ఆ ఆస్తులపై హక్కులు కల్పించేలా నిర్ణయం తీసుకుంది. పిల్లలకు తల్లిదండ్రులు గిఫ్ట్‌డీడ్ కింద, సెటిల్‌మెంట్ కింద ఆస్తులు ఇస్తున్నారు. తర్వాత తల్లిదండ్రులను పిల్లలు వదిలేస్తున్న పలు ఘటనలు వెలుగుచూస్తున్నాయి. ఇకపై ఇలాంటి రిజిస్ట్రేషన్లకు సెటిల్మెంట్లు, గిఫ్ట్‌డీడ్లు రద్దుచేశారు. తల్లిదండ్రులు, పిల్లలు ఇద్దరూ వస్తేనే రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. తల్లిదండ్రుల సంరక్షణ చట్టం 2007లోని సెక్షన్ 23 ప్రకారం తల్లిదండ్రులను జాగ్రత్తగా ఉంచడం కోసం ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. పిల్లల నిర్లక్ష్యంపై తమ దృష్టికి వచ్చిన కేసులను విచారించి నిర్ణయం తీసుకునే అధికారాన్ని ఆర్డీవోకి అప్పజెప్పారు. విచారణ తర్వాత ఆ ఆస్తిపై పిల్లల హక్కును రద్దు చేసి తల్లిదండ్రులకు అప్పజెప్పే అధికారం ఆర్డీవోకి ఉంటుంది. ఆర్డీవో ఆదేశాలను రిజిస్ట్రేషన్ల శాఖ తమ కార్యాలయాల్లోని సాఫ్ట్‌వేర్ రికార్డుల్లోనూ పొందుపర్చాలి. ఆర్డీవో ఆదేశాలకు అనుగుణంగా రిజిస్ట్రేషన్ హక్కులు మార్చాల్సి ఉంటుంది. ఈ మేరకు రిజిస్ట్రేషన్ల శాఖ ఆదేశాలు జారీ చేసింది.

## సర్టిఫికెట్లు ఆపితే అఫిలియేషన్ రద్దు

**- అడ్మిషన్ వద్దంటే కట్టిన ఫీజు వెనక్కివ్వాలి**

**- ఉన్నత విద్యామండలి చైర్మన్ కీలక ఆదేశాలు**

**అమరావతి, జనవరి 7 (జనస్వరం) :** ఫీజులు కట్టలేదని సర్టిఫికెట్లు ఇవ్వకపోవడం, అడ్మిషన్ల సమయంలో ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకోవడం, ఫీజుల కోసం విద్యార్థులను ఒత్తిడి చేయడం తదితర ఘటనలపై ప్రభుత్వం సీరియస్ అయింది. విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి భారీగా ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో కాలేజీలకు హెచ్చరికలు చేసింది. ఈ మేరకు ఉన్నత విద్యామండలి చైర్మన్ కె. మధుమూర్తి మంగళవారం కీలక ప్రకటన జారీ చేశారు. అదనపు ఫీజులు వసూలు చేయడం, రీయింబర్స్‌మెంట్ వర్తించే విద్యార్థులను ఫీజులు డిమాండ్ చేయడం వర్సిటీలు, ప్రభుత్వం ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నాయని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అటువంటి విద్యాసంస్థల అఫిలియేషన్ రద్దుచేసి, న్యాయపరమైన చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

**కాలేజీలు పాటించాల్సిన నిబంధనలివీ...**
అడ్మిషన్ తీసుకున్న తర్వాత విద్యార్థి అడ్మిషన్ వద్దనుకుంటే మొత్తం ఫీజులో 5శాతం (గరిష్ఠంగా రూ.5వేలు దాటకూడదు) మించకుండా మినహాయించుకుని 15 రోజుల్లోగా వారు కట్టిన ఫీజులు వెనక్కి చెల్లించాలి. రీయింబర్స్‌మెంట్‌కు అర్హులైన విద్యార్థులను ఫీజులు చెల్లించాలని అడగటం నిషేధం. అడ్మిషన్ సమయంలో విద్యార్థుల నుంచి మార్కుల షీట్లు, ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకోకూడదు. వ్యక్తిగతంగా నిర్ధారించి రాసిచ్చిన కాపీలు మాత్రమే తీసుకోవాలి. ఒరిజినల్ సర్టిఫికెట్లను పరిశీలించి, తిరిగి ఇచ్చేయాలి. ఏమైనా అనుమానాలుంటే వాటిని జారీచేసిన అథారిటీ ద్వారా ధ్రువీకరించుకోవాలి. ఏపీ ఉన్నత విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ ఖరారు చేసిన ఫీజు కంటే అదనంగా వసూలు చేయకూడదు.

## చర్లపల్లిలో రెగ్యులర్ రైళ్లకు మరో మూడు నెలలు?

**తిరుపతికి చేరిన తొలి రైలు**

**హైదరాబాద్ సిటీ/కుషాయిగూడ, జనవరి 7(జనస్వరం) :** దక్షిణ మధ్య రైల్వే పరిధిలో కొత్తగా ప్రారంభమైన చర్లపల్లి శాటిలైట్ టెర్మినల్ నుంచి ప్రధాన/రెగ్యులర్ రైళ్లలో రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు మరో మూడు నెలలు ఆగాల్సిందే. ఎందుకుంటే సాంకేతిక కారణాల వల్ల చర్లపల్లి స్టేషన్ నుంచి ప్రస్తుతానికి ప్రత్యేక రైళ్లనే నడపనున్నామని రైల్వే శాఖకు చెందిన ఓ ఉన్నతాధికారి తెలిపారు. ఇప్పటికే (90 రోజులు ముందుగా) సికింద్రాబాద్, కాచిగూడ, నాంపల్లి స్టేషన్ల నుంచి/వరకు వివిధ రైళ్లలో ప్రయాణీకులు రిజర్వేషన్ చేయించుకోవడంతో ఆయా రైళ్లను అవే టెర్మినల్స్ నుంచి/వరకు మరికొన్నాళ్లు తప్పక కొనసాగించాల్సి ఉంది. దీంతో చర్లపల్లి నుంచి ప్రధాన/రెగ్యులర్ రైళ్ల రాకపోకలకు సమయం పట్టనుంది. మరోపక్క, చర్లపల్లి టెర్మినల్‌కు అప్రోచ్ రహదారుల విస్తరణపై రైల్వే శాఖ రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతోంది. ఇక, చర్లపల్లి టెర్మినల్ నుంచి సోమవారం మధ్యాహ్నం 3గంటలకు ప్రారంభమైన ప్రత్యేక రైలు(07077) మంగళవారం ఉదయం 4గంటలకు తిరుపతికి చేరింది. తిరిగి మంగళవారం రాత్రి 9గంటలకు తిరుపతిలో బయలుదేరిన ఆ రైలు(07078) బుధవారం ఉదయం 8గంటలకు చర్లపల్లి చేరుకోనుంది. దీంతో చర్లపల్లి టెర్మినల్ నుంచి ప్రారంభమైన తొలి రైలుగా ఇది రికార్డులకు ఎక్కింది.

**నిర్వహణ పనులు.. నెలాఖరు దాకా పలు రైళ్ల రద్దు**
నిర్వహణ పనుల కారణంగా జనవరి నెలాఖరు వరకు కొన్ని రైళ్లను పూర్తిగా, మరికొన్నింటిని పాక్షికంగా రద్దు చేసినట్టు దక్షిణ మధ్య రైల్వే మంగళవారం ప్రకటించింది. కాచిగూడ-నిజామాబాద్-కాచిగూడ(77601-77602) రైళ్లను జనవరి 8నుంచి 31 వరకు రద్దు చేశారు. మరికొన్ని రైలు సర్వీసులను పాక్షికంగా రద్దు చేశారు. కొన్నింటి షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు చేశారు.

**సంక్రాంతికి నాలుగు ప్రత్యేక రైళ్లు**
సంక్రాంతి ప్రయాణీకుల రద్దీ దృష్ట్యా దక్షిణ మధ్య రైల్వే నాలుగు ప్రత్యేక రైళ్లను మంగళవారం ప్రకటించింది. జనవరి 9న కాకినాడ టౌన్-వికారాబాద్(07205), 10న వికారాబాద్-శ్రీకాకుళం రోడ్(07207), 11న శ్రీకాకుళంరోడ్-చర్లపల్లి(07208), 12న చర్లపల్లి-కాకినాడటౌన్(07206) రైళ్లను నడపనున్నామని వెల్లడించింది.

## వైసీపీ ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి మైండ్ పోయి మాట్లాడుతున్నాడు

**- రెడ్ క్రాస్ చైర్మన్ పదవికి రాజీనామాకు, మంత్రి నారాయణకు సంబంధం ఏంటి..?**

**- మనోహర్ రెడ్డికి వెన్నుపోటు పొడిచి చంద్రశేఖర్ రెడ్డి రెడ్ క్రాస్ చైర్మన్ అయ్యాడు**

**- చంద్రశేఖర్ రెడ్డికి నెల్లూరు ప్రజలే బుద్ధి చెబుతారు**

**- మంత్రి నారాయణపై చంద్రశేఖర్ రెడ్డి ఆరోపణలకు గట్టి కౌంటర్ ఇచ్చిన టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆనం వెంకట రమణా రెడ్డి**



**నెల్లూరు, జనవరి 7 (జనస్వరం) :** వైసీపీ ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డికి మైండ్ పోయి మాట్లాడుతున్నారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆనం వెంకట రమణా రెడ్డి మండిపడ్డారు. రెడ్ క్రాస్ ఛైర్మన్ పదవికి రాజీనామా చేస్తూ మంత్రి నారాయణపై చంద్రశేఖర్ రెడ్డి విమర్శలు చేయడాన్ని ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. చంద్రశేఖర్ రెడ్డిని ఛైర్మన్ పదవికి రాజీనామా చేయాలని మంత్రి నారాయణ గన్ పెట్టి బెదిరించినట్లుగా కట్టుకథలు అల్లారని ఆగ్రహం వ్యక్తం చేసారు. అసలు 2019 వరకూ చంద్రశేఖర్ రెడ్డి రెడ్ క్రాస్ మెంబర్ కూడా కాదని, అసలు రెడ్ క్రాస్‌లో ఏం చేస్తారో కూడా ఆయనకు తెలియదన్నారు. 2019 లో మొదటిసారి మెంబర్ అయినప్పటి నుంచి ఇప్పటివరకూ చంద్రశేఖర్ రెడ్డి ఒక్క చుక్క బ్లడ్ కూడా రెడ్ క్రాస్‌కు ఇవ్వలేదని విమర్శించారు. ఏదో రెడ్ క్రాస్‌ని తానే ఉద్ధరించినట్లుగా గతం మర్చిపోయి మాట్లాడుతున్నాడని, రెడ్ క్రాస్‌ని సర్వనాశనం చేసింది చంద్రశేఖర్ రెడ్డి అని ఆరోపించారు. నెల్లూరులో మొదటిసారి రెడ్ క్రాస్‌ను స్థాపించింది రామచంద్ర నాయుడు, సీవీ సుబ్రమణ్యం అని ఆనం గుర్తుచేసారు. రెడ్ క్రాస్‌లో ఎప్పుడూ రాజకీయాలు లేవని, అలాంటిది చంద్రశేఖర్ రెడ్డి రెడ్ క్రాస్ చైర్మన్ ఎలా అయ్యాడని ప్రశ్నించారు. రెడ్ క్రాస్ ఎన్నికల్లో చంద్రశేఖర్ రెడ్డి ప్యానల్ అసలు గెలవలేదని, మనోహర్ రెడ్డి ప్యానల్ గెలిస్తే ఆయన్ను వెన్నుపోటు పొడిచి రెడ్ క్రాస్ ఛైర్మన్ అయ్యాడని తీవ్రంగా ఆరోపించారు. మంత్రి నారాయణపై లేనిపోని ఆరోపణలు చేస్తున్న చంద్రశేఖర్ రెడ్డి.. నారాయణ హాస్పిటల్ ద్వారా ప్రజలకు చేస్తున్న మంచి గురించి కూడా ప్రజలకు వివరించాలని సూచించారు. నెల్లూరు సిటీ అసెంబ్లీ నియోజకవర్గంలో రెండు నెలలుగా పెద్ద నాయకుడిగా ఫీల్ అయిపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేసారు. చంద్రశేఖర్ రెడ్డి రాజీనామాకు, మంత్రి నారాయణకు సంబంధం ఏంటని ప్రశ్నించారు. రెడ్ క్రాస్ ఎంఓయూ గురించి అడి గితే తప్పేంటని అన్నారు. చంద్రశేఖర్ రెడ్డి విద్యా సంస్థల జోలికి ఎప్పుడూ మంత్రి నారాయణ వెళ్లలే దని, కానీ గత ప్రభుత్వంలో నారాయణను జగన్ ఎలా ఇబ్బంది పెట్టాడో అందరికీ తెలుసని అన్నారు. నారాయణని జైలుకు పంపించాలని ప్రయత్నం చేసారని ఆరోపించారు. చంద్రశేఖర్ లాంటి బచ్చాగాళ్ళకు స్పాట్ పెట్టాల్సిన అవసరం మాకు లేదని, నెల్లూరు ప్రజలే ఆయనకు బుద్ధి చెబుతారని మండిపడ్డారు.

## బురాన్‌పూర్ పాఠశాల ఉపాధ్యాయుల తీరు పట్ల అసహనం

**ఏడు తరగతులకు ఒక్కరే ఉపాధ్యాయులు హాజరు**



**బొంరాస్‌పేట, జనవరి 7 (జనస్వరం) :** మండల పరిధిలోని బురాన్పూర్ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుల పనితీరు పట్ల గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం ప్రధానోపాధ్యాయులు మేరాజ్ సెలవులో ఉండగా, ఈరోజు విధులకు టీచర్లు విజయ లక్ష్మి, అలీముద్దీన్ హాజరయ్యారు.అలీముద్దీన్ ఉపాధ్యాయుడు సంఘం సమావేశాల పేరుతో మధ్యాహ్నం దుమ్మా కొట్టడంతో పాఠశాలలో విద్యార్థులకు చదువు చెప్పేందుకు ఉపాధ్యాయురాలు ఒక్కతే ఉండడంతో చదువులు ఎలా కొనసాగుతాయని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. గతంలో మండల విద్యా శాఖ అధికారులు మందలించిన ఉపాధ్యాయుల తీరు మారడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

## కేఎన్ఆర్, సునీల్‌రెడ్డి బెదిరించారా?

**- ఎన్ని ఆస్తులు అక్రమంగా రిజిస్టర్ జరిగాయి?**

**- వైరల్ అవుతున్న మీ లేఖ సంగతేంటి?**

**- రిటైర్డ్ సబ్ రిజిస్ట్రార్‌కు కస్టడీలో ఏసీబీ ప్రశ్నలు**

**- 'బాబునే లోపల వేశాం..**

**- ఇక నీవెంత' అని బెదిరించారని ధర్మ సింగ్ వెల్లడి**

**- తన ఆరోపణలకు ఆధారాలిచ్చేందుకు అంగీకారం**

**- వాటిని చూశాక శ్రీకాంత్‌కు నోటీసు!**

**అమరావతి, జనవరి 7 (జనస్వరం) :** 'అక్రమంగా భూములు రిజిస్టర్ చేయాలంటూ ఎవరు బెదిరించారు. ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రార్‌గా ఎన్ని రిజిస్ట్రేషన్లు అక్రమంగా చేశారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న మీరు రాసిన లేఖ సంగతేంటి? అందులోని ఆరోపణలకు ఆధారాలు ఏమైనా ఉన్నాయా?' అంటూ ఏసీబీ అధికారులు అప్పటి సబ్ రిజిస్ట్రార్ లాలా బాలనాగధర్మ సింగ్‌ను ప్రశ్నించారు. చంద్రబాబునే జైల్లో వేశామని, ఇక నీవెంత అని వైసీపీ నేతలు అక్రమ రిజిస్ట్రేషన్ల కోసం తనపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తెచ్చారని ఆయన వెల్లడించినట్లు తెలిసింది. విజయవాడ ఏసీబీ అధికారులు సింగ్‌పై 2023 అక్టోబరులో ఆదాయానికి మించిన అక్రమాస్తుల కేసు నమోదు చేశారు. ముందే తెలియడంతో సింగ్ పరారయ్యారు(ఇందుకు ఓ వైసీపీ ఎమ్మెల్సీ సాయం చేసినట్లు సమాచారం). ఏసీబీ అధికారులు సోదాలు చేపట్టి ఆస్తుల పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారాక.. ఇటీవల పాత కేసుల సమీక్షలో భాగంగా.. 2023లో నమోదు చేసిన కేసు (ఎఫ్ఐఆర్ 05/ఆర్ఏసీ/సీఐయూ/ఏసీబీ)లో నిందితుడు సింగ్‌ను ఇంత వరకూ ఎందుకు అరెస్టు చేయలేదని అధికారులను ఏసీబీ డీజీ అతుల్‌సింగ్ ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో వైసీపీ పెద్దలకు సన్నిహితంగా ఉండే వారితో నిందితుడికి సంబంధాలు ఉండడం ఒక కారణం కాగా.. గత ఏడాది జూన్‌లోనే సింగ్ రిటైరైనందున దృష్టిపెట్టలేదని వారు బదులిచ్చారు. వెంటనే అరెస్టు చేయాలని ఆయన ఆదేశించడంతో రంగంలోకి దిగిన సెంట్రల్ ఇన్వెస్టిగేటివ్ యూనిట్ అధికారులు.. గత నెల 31న ధర్మ సింగ్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. కోర్టు ఆదేశాలతో జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. సోమవారం ఏసీబీ కోర్టులో పిటిషన్ వేసి.. ఆయన్ను కస్టడీలో ప్రశ్నించేందుకు అనుమతి కోరడంతో నాలుగు రోజుల కస్టడీకి న్యాయస్థానం ఆదేశాలిచ్చింది. దీంతో మంగళవారం ఉదయం విజయవాడ జైలులో సింగ్‌ను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. గత నాలుగు రోజులుగా ధర్మ సింగ్ వ్యవహారంపై వస్తున్న వార్తలకు సంబంధించి ప్రశ్నలు సంధించారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు రాసినట్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న లేఖపైనా ఆరా తీశారు. మాజీ సీఎం జగన్ పీఏ కేఎన్ఆర్, జగన్ సోదరుడు వైఎస్ సునీల్‌రెడ్డి మిమ్మల్ని బెదిరించారా..? ఎన్ని భూములు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించారు..? అవి ఎక్కడెక్కడ ఉన్నాయి..? వాటి విలువెంత.. అని ప్రశ్నించారు. విజయవాడ, విశాఖపట్నం, రాజమండ్రి తదితర ప్రాంతాల్లో రిజిస్టర్ చేసిన భూముల విలువ.. ప్రభుత్వ విలువ ప్రకారం సుమారు రూ.109 కోట్లు ఉంటుందని, ఇప్పుడు విజయవాడ, విశాఖలో భూముల మార్కెట్ విలువ రూ.700 కోట్ల దాకా ఉంటుందని ధర్మ సింగ్ బదులిచ్చినట్లు సమాచారం. ఆధారాల్లేకుండా నమ్మలేమని అధికారులు చెప్పగా.. ఆధారాలు అందిస్తానని సింగ్ చెప్పినట్లు తెలిసింది. చీమకుర్తి శ్రీకాంత్‌తో జరిపిన సంభాషణ ఆడియోలు, శ్రీకాంత్ రెండో భార్యగా చెబుతున్న వనం దివ్య(రీతూ చౌదరి) వ్యవహారంపైనా ఏసీబీ అధికారులు ప్రశ్నించారు. ఆమె గురించి తనకు పూర్తిగా తెలియదని, గోవాలో ఎంజాయ్ చేసేందుకు శ్రీకాంత్ తీసుకొచ్చే అమ్మాయిల్లో ఆమె కూడా ఉందని చెప్పినట్లు సమాచారం. ఈ నాలుగు రోజుల్లో ధర్మ సింగ్ చెప్పే వివరాలు, వాటికి లభ్యమైన ఆధారాలతో వైసీపీ నేతలకు, చీమకుర్తి శ్రీకాంత్‌కు నోటీసులిచ్చి పిలిపించాలని ఏసీబీ యోచిస్తున్నట్లు తెలిసింది.